# కవితా కౌముది - 2011





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



ప్రచురణ సంఖ్య: 57

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. నిన్నటి తరం | కుప్పచ్చి ఫణీంద్రకుమార్ | 5 |
| 2. ఓటమి | మోహన్ చైతన్య | 6 |
| 3. అ'మర'జీవి - కవి | ప్రఖ్యా మధుబాబు | 6 |
| 4. నా జ్ఞాపకాలు | గంటి భానుమతి | 7 |
| 5. ఈ ఉదయం | ఆత్రేయ కొండూరు | 8 |
| 6. ఇదేమిటి | భువనచంద్ర | 8 |
| 7. మీకు తెలిస్తే చెప్పరూ | పి.ఎస్.నారాయణ | 9 |
| 8. అయ్యో నాకంఫర్ట్ జోనా! | డా.గరిమెళ్ళ నారాయణ | 10 |
| 9. హస్తలాఘవం | నూతక్కి రాఘవేంద్రరావు | 11 |
| 10. మనసు | భద్రిరాజు శ్రీనివాస్ | 11 |
| 11. ప్రేమ వృక్షం | డా.రమణ యశస్వి | 12 |
| 12. నవ్వు | వేమూరి విజయలక్ష్మి | 13 |
| 13. సుక్కనై రాతిరేల | విజయభాస్కర్ | 14 |
| 14. రేవునుంచి రేవుకు | మాకినీడు సూర్యభాస్కర్ | 14 |
| 15. వేదన | సన్నిహిత్ | 15 |
| 16. నవమేనక | మల్లాప్రగడ బాలా త్రిపుర సుందరి | 15 |
| 17. బోస్టన్ గడియారం | మల్లాప్రగడ రామారావు | 15 |
| 18. మట్టిరూపులం | శిల్పం | 15 |
| 19. దరహాస చంద్రిక | జ్యోతిర్మయి | 16 |
| 20. జ్ఞాపకాలు | శ్రీవల్లి | 17 |
| 21. అలనాటి స్నేహం | రాజి చెన్నుపల్లి | 17 |
| 22. జన్మల బంధం | పల్లాపు రాము | 18 |
| 23. అగాధం | సత్య | 18 |
| 24. నయాగరా జలపాతం | న్యాయపతి వెంకటమణి | 19 |
| 25. రాగబంధం | రాళ్ళపల్లి రామసుబ్బారావు | 19 |
| 26. అమ్మవారు | డా.నారాయణ గరిమెళ్ళ | 20 |
| 27. కవి | సత్య | 21 |
| 28. జైలులో ఓ చిన్ని ఎలుక | జగద్ధాత్రి | 21 |
| 29. కరిణార్థులు | చెల్లూరు సాంబమూర్తి | 22 |
| 30. కలల వెలలు | కుంతి | 23 |
| 31. కలహాంతరిత | ప్రొ.కె.వి.ఎస్.జ్ఞానేశ్వర రావు | 24 |

| | | |
|---|---|---|
| 32. మౌనం | ప్రవీణ కొల్లి | 24 |
| 33. పరిపూర్ణత | చంద్రుపట్ల తిరుపతి రెడ్డి | 25 |
| 34. ఉగాది నేనై | న్యాయపతి వెంకటమణి | 25 |
| 35. కవిని | డా.కిషోర్ కుమార్ | 26 |
| 36. అమ్మ | రఘుకుల తిలక్ | 27 |
| 37. నువ్వు | సాంజీ శ్రీరామ్ | 28 |
| 38. వేటగాడు | గరిమెళ్ళ నాగేశ్వరరావు | 29 |
| 39. వర్షం | రాధిక బుక్కా | 30 |
| 40. నా..ఉగాది | సి.హెచ్. నాగభూషణరావు | 30 |
| 41. ఈ యుగం..ఓ దారుణం.. | ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 31 |
| 42. జీవితం ఓ దీపారాధన | జె.బి.వి | 31 |
| 43. నేను | చెల్లూరు సాంబమూర్తి | 32 |
| 44. నిజంగా మనం | సత్య | 33 |
| 45. సమన్వయాలు | నూతక్కి రాఘవేంద్రరావు | 33 |
| 46. ఈ చందమామ | జొన్నలగడ్డ నారాయణ మూర్తి | 34 |
| 47. మానవుడే మాధవుడు | పొదిల రామకృష్ణ | 34 |
| 48. అమ్మ వెళ్ళాక | డా.కె.గీత | 35 |
| 49. ఎంతుంది కాలం మిగిలి? | జ్యోతిర్మయి మల్ల | 37 |
| 50. అదిగదిగో | ప్రవీణ కొల్లి | 38 |
| 51. నేను | సన్యాసి | 38 |
| 52. రింగు రింగు భామ | విజయ చావలి | 39 |
| 53. కలలు చెక్కిన శిల్పం | పెరుగు రామకృష్ణ | 40 |
| 54. వ్యయం | డా.గండ్ర లక్ష్మణరావు | 41 |
| 55. నెగిటివ్ గానే | దాసరాజు రామారావు | 42 |
| 56. విలోమం | పల్లాపు రాము | 44 |
| 57. ఎదగడమంటే | చెల్లూరు సాంబమూర్తి | 44 |
| 58. ఉగాది కోయిల ఉద్వేగం | జొన్నలగడ్డ నారాయణమూర్తి | 45 |
| 59. అనామిక | సత్య | 45 |
| 60. దిక్కుమాలిన దిశకెందుకు? | డా.నారాయణ గరిమెళ్ళ | 46 |
| 61. మాయా? భ్రమా? | భువనచంద్ర | 47 |
| 62. ఆహ్వానం | అత్తలూరి విజయలక్ష్మి | 48 |
| 63. మురళి | వారణాసి నాగలక్ష్మి | 49 |
| 64. తెలుగు వనిత | ద్వాదశి రామలక్ష్మి | 49 |

| | | |
|---|---|---|
| 65. అద్దంలో దాగిన నేను | మాధవ తురుమెళ్ళ | 50 |
| 66. నన్ను క్షమించు | మనస్విని | 52 |
| 67. టెక్నిక్కు | ఎస్. ఆర్.బందా | 53 |
| 68. శూన్యం | ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 54 |
| 69. ఇది ప్రగతి | ఉమాదేవి పోచంపల్లి | 54 |
| 70. వైతాళికునివై జీవించు | అలజంగి ఉదయకుమార్ | 55 |
| 71. నిరీక్షణ | జ్యోతిర్మయి | 56 |
| 72. వీడుకోలు | వేమూరి విజయలక్ష్మి | 57 |
| 73. భగ్నప్రేమ | బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్ | 58 |
| 74. ఏమో..ఏమో.. | డా.మూర్తి జొన్నలగెడ్డ | 59 |
| 75. మేము మేమే..మాకు మేమే.. | విజయ్ | 60 |
| 76. ఎడబాటు | జ్యోతిర్మయి | 61 |
| 77. ఆ క్షణం | ఎస్. ఆర్.బందా | 62 |
| 78. కృతఘ్నత | వింజమూరి రాగసుధ | 63 |
| 79. ఇంతేనా..జీవితం | బుద్ధ వెంకట ప్రతాప్ రెడ్డి | 63 |
| 80. జ్ఞాపకాలు | శ్రీమతి రత్నమాంబ చీర్ల | 64 |
| 81. రైతు హాలిడే | డా.రమణ యశస్వి | 65 |
| 82. అందమైన ప్రశ్న | శుభ | 66 |
| 83. విలోమగమనం | రావెల పురుషోత్తమ రావు | 66 |
| 84. కొంతమంది ఎన్నారైలు | డా.మూర్తి జొన్నలగెడ్డ | 67 |
| 85. వ్యత్యాసం | ఉమాదేవి పోచంపల్లి | 68 |
| 86. కీర్తి | గొల్లపూడి మారుతిరావు | 69 |
| 87. అజేయం | టి.శ్రీవల్లీ రాధిక | 70 |
| 88. పగిలిన స్వప్నాలు | అరుణ దొంతరాజు | 71 |
| 89. నిర్వేదం | జ్యోతిర్మయి | 71 |
| 90. మనో వేదన | వేమూరి విజయలక్ష్మి | 72 |
| 91. అమ్మాయిలూ జాగ్రత్త | కోసూరి ఉమాభారతి | 73 |
| 92. అతనొక సైనికుడు | మనస్విని | 74 |
| 93. గొంగళి - నల్లనయ్య | బత్తిని తిమ్మగురుడు | 75 |

## నిన్నటి తరం

కుప్పచ్చి ఫణీంద్రకుమార్

**తరమెళ్ళిపోతోంది...**

గురుతర బాధ్యతలు మాపై వదిలి...

తాతల తరం తరలెళ్ళిపోతోంది...

ఉప్పెక్కించుకున్న వీపు విశ్రాంతి కోరింది...

లోకాన్ని చూపించిన వేలు ఇక కనిపించనంది...

కలల అలల పై ఆడించు ఒడి కాలక్రీడకు ఓడిపోయింది...

కథల తోటి మా వ్యథలు తీర్చిన మాట మూగబోయింది..!!

తరమెళ్ళిపోతోంది...

తాతల తరం తరలెళ్ళిపోతోంది...

రేపటిని మాకిచ్చి నేటికి నిన్నలా మిగిలిపోతోంది...!!

స్నేహ శీలతే సంపదగా..

మానవీయతే మన్ననగా...

నమ్మిన విలువలే వెలలేని సిరిగా...

నమ్ముకున్న వారి ఆదరణే తన విధిగా...

నడయాడిన ఓతరం

తన జాడలు మాకై వదిలి...

ఇక శెలవంటూ వెళ్ళిపోతోంది...కాల గతిలో మళ్ళిపోతోంది..!!

కడగండ్లను ఎదిరించు మనోస్థైర్యమే శ్వాసగా ...

భేషజమెరుగని బోసినవ్వులే తన బాషగా...

ప్రతిదినమున అగుపించే సూర్యోదయమే తన ఆశగా...

పరోపకరమే పెన్నిధిగా...పరమానందమే పరమావధిగా...!!

బ్రతికిన  తరమెళ్ళిపోతోంది...

మా తప్పులను సరిచేయు అనుభవాల తరువు తరిగిపోతోంది...!!!

## ఓటమి
### మోహన్ చైతన్య

**అపుడపుడే వచ్చిన**
లేలేత రెక్కలతో
ఊహాకాశంలో విహరించే
భావ విహంగాలను
అక్షరాల పంజరాల్లో
బంధిద్దామని
మహాగ్రంథం విరచిద్దామని
తెల తెల్లని బ్రతుకు పుస్తకంపై
వెర్రి మొర్రి ఉద్వేగంతో
నే ప్రయత్నిస్తే
చితికిన ఆశల
సిరా చుక్కలు
అటు ఇటు ప్రవహిస్తే
మిగిలిందంతా నల్లనే
బ్రతుకంతా తీరని అవేదనే!!

## అ 'మర' జీవి - కవి
### ప్రఖ్యా మధుబాబు

**బతికుండగా చస్తాడు**
మరణం అవతలినించి ఈ జీవితాన్ని చూస్తాడు
మనసు రంగులు మనిషికై అద్దుతాడు
కనులు మూసుకున్నా చూడగలడు
తెరిస్తే నిద్ర పోతాడు
రవి చూడనివీ చూడగలడు
విమానాలు లేకున్నా విహరించగలడు
ముందున్నవి చూడలేడు
వేటికోసమో వెదుకుతాడు
అమృతం తాగకున్నా అమరుడు
నింగిలోని తారలని నేలపైకి విసురుతాడు
మరి ప్రజలకొరకు బతుకుతాడు

# నా జ్ఞాపకాలు

గంటి భానుమతి

**కొన్నివేల అమావాస్యల్లాంటి చీకట్లోకి**
నిశ్శబ్ద నీరవనిశీధిలోకి చూస్తున్నా
జ్ఞాపకాల పొరలు ఒక్కొక్కటి విడిపోతుంటే
ఆమడ దూరానున్న నిద్రకేసి ఆశగా
విప్పార్చుకున్న కళ్ళతో, విధిలేక
కళ్ళని చెమర్చిన జ్ఞాపకాలు కొన్ని
గుండెమూలల్ని తడిమినవి కొన్ని
ఉత్సాహ డోలలూగించినవి కొన్నయితే
మనసుని చంపేసినవి కొన్ని - అన్నీ నావే
రెప్పల చివర ఆగిపోయిన కలలు
కళ్ళనుంచి జారిపోయిన కలలు
కన్నీటిలో తడిసిపోయిన కలలు
కల్లలయిన కలలు..అన్నీ నా జ్ఞాపకాలే
ఏకాంతంలో అలజడిని కలిగిస్తూ
నిద్రకి బద్ధ శత్రువులైపోయాయి..
బాల్యంలోని నిర్మల అమాయక జ్ఞాపకాలు
వయసులో ఇంద్రచాపాల్లాంటి జ్ఞాపకాలు
అన్నీ చైతన్యం నింపుకున్నవి
నాకు చెందినవి ఈ జ్ఞాపకాలు!
ఒంటరి జీవితానికి తోడౌతాయనుకుంటే
ప్రతినిమిషాన్ని భంగపరుస్తున్న జ్ఞాపకాలు
అందుకే
మళ్ళీ మళ్ళీ నా కళ్ళముందుకి రాకుండా
నా ప్రశాంతతని భగ్నం చెయ్యకుండా
నా మనసుని పక్కదోవ పట్టించకుండా
రోజురోజుకి శత్రువులై పోతున్న ఆజ్ఞాపకాలని
ముక్కలు ముక్కలుగా చేసి
నాకు తెలీని దారిలో
నేను వెళ్ళని దారిలో విసిరేశాను!
ఒక్కసారిగా తుఫాను, సుడిగాలి
...గాలి వాటం..విసురు మారింది..
ముక్కలు చేసిన జ్ఞాపకాలు పైకి లేచాయి
ఎగురుతూ , ఎగిసిపడుతూ, సుళ్ళు తిరుగుతూ
నా కళ్ళముందు ఎగురుతున్నాయి
కళ్ళకి దగ్గరగా ఎగురుతున్నాయి..
దగ్గర గా , పెద్దగా, ఇంకా దగ్గరగా, ఇంకొంచెం పెద్దగా ..
ఉలిక్కి పడ్డాను..అందులోని భావాల్ని చూసి
అవన్నీ నేను వెనక్కి తోసేసిన జ్ఞాపకాలు
నేను చింపేసిన నా జ్ఞాపకాలు
నాకు చెందిన నా జ్ఞాపకాలు
నన్ను వదల్లేని నా జ్ఞాపకాలు
మనసుని వదల్లేని జ్ఞాపకాలు
చెమర్చినవి, కుదిపేసినవి
గుండెల్ని పిండేసినవి, కదిలించినవి
నన్ను వదలని ఆస్థులు. స్థిరాస్థులు
చితివరకూ తోడుగా, నన్నంటే జ్ఞాపకాలు
నా వెంటనుండే జ్ఞాపకాలు!!

## ఈ ఉదయం
### ఆత్రేయ కొండూరు

బరువుగా బిగిసిన
తలుపుల వెనక, చీకట్లో..
రంగుల ప్రపంచం
ఓ లోయ సరిహద్దుల్లో అంతమయింది

రెండు సూర్యుళ్ళ ఉదయంతో
సగం కాలిన రాత్రి
ముళ్ళ కంప మీద
అలానే కరిగిపోయింది.

చెట్ల పచ్చని రంధ్రాల్లోనుంచి
జారిపోతున్న చీకట్లకు
తనువు చాలించిన తుంపర్లు
తెరలవుతున్నా..

చల్లగా వీచిన తెల్లపదాల తావి
పూల తోటలోకి ..దారి చూపింది.

## ఇదేమిటి
### భువనచంద్ర

కనులను మూసేసుకునీ
కలల్లోన దాగున్నా!
ఎదలోయల మలుపుల్లో
చితులను పేరుస్తున్నా!
చెదపట్టిన ఓ 'గురుతు' ని
కొత్తగాలి చెరిపేస్తే..
పాతరాత తుడిచి పెట్టి
'భాష' ని కనిపెడుతున్నా!
గుండెలోన సూదిగుచ్చి
ప్రవహించే రక్తంలో
అక్షరాల ముత్యాలని
కాలంతో కొలిచేశా
ఎన్ని ఎన్ని ముత్యాలు!
ఎన్ని రుధిర సంద్రాలూ..!
ఆవిరైన ఊహల్లో
ఎన్ని ఎన్ని 'వర్షా'లూ..!
రాతి మీది యాతా..
ఇది
లేతగుండె కోతా?

# మీకు తెలిస్తే చెప్పరూ? పి.ఎస్.నారాయణ

**ఈ జగత్తు చీకటి తెరల్లో కప్పబడి**
భూమి తన ఉనికిని గుర్తించని అస్థిత్వంలో
సమయానికి సమయం తెలియని సమయంలో
తొలికిరణాన్ని జ్వలింప జేసిందెవరు?

విశ్వాంతరాళాల్లో పుడమిని ఏ
ఆధారం లేకుండా వ్రేలాడదీసి
తన చుట్టూ తాను పరిభ్రమింపజేస్తూ
సూర్యుని చుట్టూ చలింపచేస్తున్నదెవరు?

వసుధకు ప్రకృతిని చీరగా చుట్టి
గుట్టలు - పుట్టలు, చెట్టులు-చేమలు
పొలాలు - పీఠభూములు, నదీ నదాలు
సముద్రాలతో అలంకరించినదెవరు?

భూమాత నిశ్శబ్ద గమనాన్ని చీలుస్తూ
మానవమనుగడకి నాంది పలుకుతూ
భావితరాలకు సృష్టికి సంకేతాన్ని సూచిస్తూ
'కేరు' మన్న మొదటి జీవికి జన్మనిచ్చిందెవరు??
ఆనందం - విషాదం సుఖం - దుఃఖం
ఆశ-నిరాశ, ఆవేశకావేశాలు
ఇలా ఎన్నో వివరణ లేని భావనలతో
మనిషిని సతమతం చేస్తున్నదెవరు??
అన్నీ తనవనుకుని, ఏదీ తనదికాదని
తెలుసుకోకుండానే శాశ్వతంగా నిష్క్రమించే
ఈ జీవి రాక ఎక్కడ్నుంచీ..? పోక ఎక్కడికి?
మీకు తెలిస్తే చెప్పరూ...!!??

# అయ్యో! నా కంఫర్ట్ జోనా!

డా.గరిమెళ్ళ నారాయణ

**అయ్యో నా కంఫర్ట్ జోనా!**
ఫొటోలలోని దేవుళ్ళ వెనుక
తిరిగే దేదీప్యమానమైన చక్రాల్లా
నన్ను అంటి పెట్టుకుని
నాకు ఎనలేని కీర్తిని పాదించిపెడతావని
నిన్ను నమ్ముకుంటేణ
ఎప్పుడూ నేల విడిచి సాములే చేస్తానంటావు.

లైఫ్ ఇన్స్యూరెన్స్‌లాగో
హెల్త్ ఇన్స్యూరెన్స్‌లాగో
ప్రావిడెంట్ ఫండ్ లాగో
బ్యాంక్ బ్యాలన్స్ మీద నెల నెలా వచ్చే
అసలు కన్నా ముద్దు ఐన వడ్డీ  లానో
ఢోకా నిచ్చే సుఖమయ జీవితపు పానుపుతో
నన్ను ఆదుకుంటావనుకుంటే

ఎడారులమ్మటా అడవులమ్మటా
కొండల కోనల వాగుల వెమ్మటా
అలుపెరగ కుండా తిరిగిస్తూ
సమాజాన్ని ఔపోసన పట్టమంటావు!
సమ సమాజాన్ని సృష్టించే వాళ్ళ
కలల్లో కలలు కలిపి పునర్జన్మించ మంటావు!

వసుదేవుడు చిన్ని కృష్ణున్ని కాపాడు కున్నట్టు
నువ్వు కూడా అనేకానేక గాడిదల కాళ్ళు
పట్టుకునైనా
నన్ను కాపాడు కుంటావనుకుంటే...
అన్యాయమని పించిన ప్రతి చోటా
నన్ను బలిచేసిమరి ప్రశ్నలు ప్రశ్నలై
విచ్చుకుని తెగని వాళ్ళకు గుచ్చుకుని మరీ
అనేకానేక శత్రువులని సంపాదించి పెడతానంటావు!

కనీసమైనా లౌక్యం నేర్చుకుని
ఐన వాళ్ళకు ఆకుల్లోను కాని వాళ్ళకు కంచాల్లోనూ
పెట్టడం నేర్చుకుని
నన్ను అందలమెక్కిస్తావనుకుంటే,

పదివేల రూపాయల అప్పు తీర్చలేకే
పురుగుల మందు తాగి చనిపోయిన రైతు మాదిరి,
సూక్ష్మ  రుణాల ఊబిలో కూరుకుపోయిన
అమాయకపు పల్లె పడచులు విడిచే ప్రాణాల మాదిరి,
ప్రేమోన్మాది చేసిన యాసిడ్ దాడిలో కళ పోయిన
కలలు కాచిన అమ్మాయి మాదిరి
గాయ పడిన సమాజాల మధ్య సంచరిస్తూ
నిత్యం ఘర్షణలో మునిగి తేలడమె జీవితమని
నినదిస్తూ పోతుంటావు!
చెయ్యని తప్పులు సైతం నెత్తికెత్తుకుని
పకపకల వికవికల జనానికి
ఎప్పటికప్పుడు పాఠాలు చెప్పమంటావు!
అయ్యో నా కంఫర్ట్ జోనా
నాకు తెలుసు నన్ను నువ్వు నిశ్చలంగా ఉండనివ్వవు
ఎప్పటికప్పుడు నా నుండి దూరమవుతూ నిన్ను
అందుకోవడమే నాకు నిత్య జీవిత పరిక్షంటావు!
కాని, ఇప్పుడు నేను సాగరాన్ని మథించే వాళ్ళకు
మందర పర్వతాన్ని  కావడానికి సిద్ధపడిన వాడిని.
నాకు నీతో పనేమిటి?
ఒక సారి హాలాహల మొచ్చినా
ఎప్పటికైనా అమృతాన్ని చిలికి
అభాగ్యులందరికీ సమానంగా పంచి పెడతాంలే

## హస్త లాఘవం
### నూతక్కి రాఘవేంద్రరావు

**అధికారి**

హస్తాక్షరం చేసిన

హస్తానికి

తెలియదు

పాపం

అడిగిన మొత్తం

దండుకొని

బహిరంగంగా నే ...

రెండో చేయి

దాచి పెట్టిన

ముడుపు ల సంగతి.

## మనసు
### భద్రిరాజు శ్రీనివాస్

**ప్రేమ భావంతో పులకరిస్తుంది.**
విప్లవ స్ఫూర్తితో ఉరకలేస్తుంది.
భవిత నాదేనంటూనింగిని తాకుతుంది.
నైరాస్యంతో నీరుగారిపోతుంది.
చేతిలోని ఇసుకలా జారిపోతున్న రోజులని ,
మంచుముక్కలా కరగు ఆయువునూ చూచి భీతిల్లుతుంది.
అంతా మిధ్య అంటూ, గుడుల తిరుగుతుంది
గురువుల నడుగుతుంది ;
ఆశ్రమాలనాస్రయిస్తుంది, ఆరామాలచేరమంటుంది
అంతలోనే సౌఖ్యాభిలాషియై రంజిల్లుతుంది.
వయసుమీరిన తనువులూ, వయసెరుగని తానిమడలేక ,
నిన్నతానున్న తామునున్న ఆ యువత ఎడ అసూయతో
అలసిపోతుంది---మనస్సు
మాయ మోహితమై, తుఫాను తాకిన మహాసముద్రపుటలలా
ఊగిపోయేదీ మనస్సు
మారనిది మహామయస్వరూపమైనది కాలం;
నిర్వేదంగా నిర్వికారంగా నిలచివుంటుంది

# ప్రేమవృక్షం

డా.రమణ యశస్వి

**గోరుముద్దలలో**
అఆఇఈ లు
నంజి పెట్టిన
గొప్ప ప్రొఫెసర్ మా అమ్మ
చలువే నేను
చదివిన పెద్ద చదువులు
జలుబుకీ
కడుపు నొప్పికి
వెరవక
అన్నీ తానై నన్ను రక్షించి
పెంచి పెద్దచేసిన
గొప్ప డాక్టరు మా అమ్మ

నేను పొడుగవ్వాలనీ
దృఢంగా బాగుండాలనీ
మంచి ఆహారమిచ్చి
డ్రస్సులు వేసి
మౌనంగా నా ఎదుగుదలను
గమనిస్తూ వుండే మా అమ్మ
గొప్ప బ్యూటీషియన్

నేను బడినుండో, కాలేజీ నుండో
రాగానే నా మనసు స్కాన్ తీసి
ఆ రోజు క్లాసులో ఏమైందో
కనుక్కుని నాకు సలహాలిచ్చే
మా అమ్మ గొప్ప
మనోవికాస నిపుణురాలు

సాయంత్రం నేనొచ్చే దాకా
'అ'లు పెరుగని 'మ్మ'నస్సుతో
నా కోసం అరుగుపై
ఎదురుచూసే మా అమ్మ
గొప్ప ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్

నాన్న చేసే తప్పులు దిద్ది
సంసారమనే బండిని
ప్రక్కసీట్లో కూర్చొని
సాఫీగా నడిపిన
నిశ్చల మనస్విని
గొప్ప రథసారథి మా అమ్మ

మగవాడికన్నా కూడా
శీలం ముఖ్యం అంటూ
అడుగడుగునా
గీతదాటకుండా
గీతబోధించిన
నడిచే భగవద్గీత మా అమ్మ!

జీవితమనే సినిమా
ఎన్ని మలుపులు తిరిగినా
శుభం కార్డు
పడేలా చేయగల
సమర్థ కథానాయకి మా అమ్మ!
ప్రేమ విత్తనాలు జల్లి
ప్రేమను పంచి
ప్రేమను పెంచిన
మహాప్రేమ వృక్షం మా అమ్మ!!

# నవ్వు

వేమూరి విజయలక్ష్మి

**నవ్వు - పెట్టని ఆభరణం మనిషికి**

నవ్వుతూ, నవ్విస్తూ బ్రతకాలి
కాని సమయాన్ని బట్టి నవ్వే నవ్వులలో తేడాలు -
పసిపాపవి చింతలేని బోసినవ్వులు
ఆడే పాడే చిన్నారులవి మురిపించే నవ్వులు
వయసులోని యువతవి హృద్యమైన నవ్వులు
మనిషినీ మనిషినీ బంధించేవి స్నేహపూరితమైన నవ్వులు
దంపతులను కలిపి ఉంచేవి
ఆ బంధంలోని మధురమైన నవ్వులు
గురు శిష్యుల మధ్య, గురువుది వాత్సల్య పూర్వకమైన నవ్వైతే,
శిష్య పరమాణువుది గౌరవ సూచకమైన నవ్వు.
అపరిచితులను దగ్గర చేసేది పరిచయం గావించే నవ్వు.
నవ్వు రాకపోయినా నవ్వే నవ్వు తెచ్చి పెట్టుకున్న నవ్వు.
హాస్య సన్నివేశాలలో ఫక్కుమనిపించే నవ్వులు.
చిన్నారులను దీవించేటప్పుడు తళుక్కుమనేవి
ప్రేమపూర్వకమైన ఆశీర్వదించే నవ్వులు. ఇంకా
చేతగాని నవ్వులు, వ్యంగ్యమైన నవ్వులు,
భయంకరమైన నవ్వులు, చులకన పరిచే నవ్వులు,
భయం గొలిపే నవ్వులు.
నవ్వులెన్ని రకాలైనా
నవ్వులపాలు చెయ్యని నవ్వులు
నవ్వులతో నవ్వులు పంచే నవ్వులు
అవే మనిషికి వరమని తెలుసుకుంటే
అదే నిజమైన నవ్వుకి అర్థం, పరమార్థం..!

## సుక్కనై రాతిరేల..
విజయభాస్కర్

**గురుతుకొస్తే సాలె, నా ఎంకి,**
గుబులు గుండై పోతాది..
నన్ను నేను మరచేపోతానే.
నాకు నా గురుతు రానీయకే..

తోడుగా నువ్వొస్తే,
పగలు సీకటై పోతాది..
నేను నీతో ఏకమై పోతానే.
నా తోడు వొదలకే..

దొరకనన్నావంటే ఓ నా ఎంకి,
బరువు బ్రతుకై పోతాది..
లోకమంతా నాకు ఎతుకులాటే.
నాతో దోబూచు లాడకే..

సూసీ నను దాటేసినావంటే,
యింక నేనెక్కడుంటానే..
సుక్కనై రాతిరేల
నీకు తోడవ్వకుంటానే ?

## రేవు నుంచి రేవుకు
మాకినీడి సూర్యభాస్కర్

**ప్రవాహానికే...**
**రేవు!**

రెండు తీరాల మధ్య
పరిగెత్తే నిరంతర చైతన్యం
ప్రవాహం!
అదే పచ్చదనం
అదే ఆకాశ నీలిమ...
ఒకే ఇసుక తీరం
ఒకే గాలి దుమారం
నదికి అటూ ఇటూ
రెండు రేవులు...
రేవులు రెండూ...
రెండు ప్రపంచాలు!
మెలకువ రేవులో ఎక్కిన నావ
అవతల నిద్ర రేవును చేరుతుంది
రెండు ప్రపంచాల మధ్య
ప్రవహించే నిరంతర చైతన్యం కదా...
జీవితం!
బ్రతుకు రేవులో ఎక్కిన నావ
అవతలి రేవుకు చేరక తప్పదు!

## వేదన
### సన్నిహిత్

**కనుల ముందు రాళ్ళ బాట**
కరిగి పోని కలల వేట
ఆశయాల దారి వెంట
అలుపెరుగని వెతుకులాట
సామాజిక స్పృహయన్నది
జనం నవ్వుకునే పిచ్చిమాట
సామన్యుడి బ్రతుకన్నది
విలువ లేని గడ్డి మేట
జన జీవన యజ్ఞంలో
బడుగు జీవి సమిధయంట
నిశి రాత్రి గగనంలో
రాలిపడే ఉల్కయంట

## నవ మేనక
### మల్లాప్రగడ బాలాత్రిపుర సుందరి

**తీరని నిద్ర కనురెప్ప విప్పనీయనంటుంది**
కదలిపోతున్న కాలం తప్పదంటుంది
కలల దుప్పటిని తన్నేయడంతో
నాటి పరుగుపందెం మొదలవుతుంది.
శకుంత పక్షుల నీడలో
పసిడి బొమ్మను వదిలేసి వెళ్తున్న మేనకలా
"డే కేర్"లో పిల్లల బరువు మనసుకెక్కించుకుని
కొలువుకూటం చేరుకుంటాను.
గడియారం వైపు చూడాలంటేనే గాభరాగా వుంటుంది
ఉదయం అంతగా పరుగులు పెట్టే కాలం
కచేరీలో ఘనీభావిస్తుందేమో అని విస్తుపోతాను.

## మట్టి రూపులం – శిల్పం

**నీట మునిగి తేలుతున్న**
మట్టి రూపులం మనం
చివరి మజిలి చావేనని
తెలిసి మసలు తున్నాం...
వెంటరాని సంపదకై
వృధా శ్రమిస్తున్నాం..
చెడుని చేరి, మంచుగ
మంచిని కరిగిస్తున్నాం ......
రాని నవ్వుని నలుగురిలో
రంగరించుతున్నాం
'కల్పితం'తో కసిగా
కరుణని కాలరాస్తున్నాం

## బోస్టన్ గడియారం
### మల్లాప్రగడ రామారావు

**సెకెండ్లు నడవడానికి**

నిమిషాలు పడుతుంటే,

నిమిషాలు గడవడానికి

గంటలు చాలకపోవడంలో వింతేముంది?

# దరహాస చంద్రిక

జ్యోతిర్మయి

**నిన్న బద్ధకంగా నిదుర లేచాను**
చల్లగాలి వీడ్కోలు చెబుతూ వెళ్ళిపోయింది
కిరణాలు వెచ్చగా గుచ్చుకున్నాయ్
మెల్లగా వ్యాహ్యాళికి బయలు దేరాను
అబ్బ ఈ ప్రకృతి ఎంత అందంగా వుందో
ఎత్తైన చెట్లు, చెట్టు మీద ఎగిరే గువ్వ పిట్టలు,
పచ్చటి కొండలు, పరగులేత్తే జింకలు

నడకలో తెలియ కుండానే చాలా దూరం వచ్చేశాను
పిల్లలు ఎంత చలాకీగా ఆటలాడుకుంటున్నారో
స్నేహితులతో కబుర్లు చెపుతూ సాగి పోతున్నారు
ఆ ఇంటి ముందు ఎర్ర గులాబి గాలికి అందంగా ఊగుతోంది

ఎన్నెన్ని రంగులో ఎన్ని రూపాలో
రంగు రూపు ఆకృతి లేని నన్ను చూసుకుని
దుఃఖ భారంతో క్రుంగి పోయాను
నన్నూ  జీవన స్రవంతిలో కలిపేయమని
భగవంతుణ్ణి వేడుకున్నాను
ఇదేమిటి ఇలా నీలంగా మారిపోతున్నా నేమిటి
క్షణ క్షణానికి ఎలా బరువైపోతున్నా నేమిటి
ఇంతకు మునుపెప్పుడూ ఇలా లేదే
నా రూపం కరిగినీరై నేల పైకి జారిపోతున్నాను
నేను దరి చేరగానే  చిన్ని విత్తనం మొలకై పోయిం0దేమిటి
నా సంతోషం మొగ్గ తొడిగి సిరమల్లై  పూసింది
ఆ పరిమళం మీ పెదవులపై దరహాస చంద్రికై నిలిచింది -
ఒక రూపంటూ లేని మేఘాన్నే నేను..
రూపాలెన్ని మార్చినా కరిగి నీరయ్యే దాన్నే నేను..!!

# జ్ఞాపకాలు
శ్రీవల్లి , హైదరాబాదు

**జ్ఞాపకాలు మనసు పుస్తకంలో పదిలంగా రాసుకున్న**
అనుభవాలు
మదిలో విహరించే గడిచిన ఊహాచిత్రాలు
మనకు దేవుడు ఇచిన గొప్ప వరాలు
కొన్ని అనుభవాలు తియ్యగా....హాయిగా
కొన్ని అనుభవాలు చేదుగా....బాధగా
కొన్ని ఒక అందమైన స్వప్నంలా......

కొన్ని కంట తడి పెట్టిస్తాయి...
కొన్ని చిరునవ్వుని కురిపిస్తాయి...
కొన్ని మనసారా హత్తుకుంటాయి ...
కొన్ని కోపంతో చీదరించుకుంటాయి...
ఎడబాటులో మన తోడు నిలిచే నేస్తాలు జ్ఞాపకాలు
జీవితంలో ముందుకు సాగేందుకు స్ఫూర్తిని నింపేది జ్ఞాపకాలు
నిరాశతో నిండినపుడు
కొత్త ఆశలను చిగురింపచేసేది జ్ఞాపకాలు
విధి విపరీతానికి బలి అయిన మనిషికి
చివరికి మిగిలిన ఆస్తి జ్ఞాపకాలు

# అలనాటి స్నేహం
రాజి చెన్నుపల్లి

**అదే ఊరు అదే గుడి**
తాయిలాలు మార్చుకున్న చిన్ననాటి స్నేహం
గుజ్జనగూళ్ళు కట్టిన అవే చేతులు
అమాయకంగా అలిగి ఏడ్చిన అవే కళ్ళు
మన మాటలు విని మురిసిన అవే చెట్లు
చల్లని గాలితో లాలించిన అవే పంటపొలాలు
సేద తీరమని అడిగే అదే రావిచెట్టునీడ
జ్ఞాపకాల పరిమళాలు వెదజల్లే అదే సన్నజాజి
చిన్ని చిన్ని చేతులతో దాహం తీర్చిన అదే కోనేరు
తెలిసీతెలియని భక్తికి మురిసిన అలనాటి రామయ్య
అల్లిబిల్లి ఆటలతో అలసి సేదతీరిన అదే మైదానం
ప్రియనేస్తం
కాని ఇప్పుడు
అనుభవించేందుకు అందమైన బాల్యం లేదు
వయస్సు మరచిపోయి, అంతస్తుల అంతరాలు మరచి ఆడే
కల్మషం లేని మంచి మనసులు మనకు లేవు.....

## జన్మల బంధం
## పల్లాపు రాము, నెల్లూరు

**శూన్యత నిండిన**

అంతరాల కన్నుల లోయలలో ,

ఆర్ద్రత నిండిన

వేదనా ప్రవాహాలు

పరవళ్ళు తొక్కే సమయాన ,

గుప్పెడు మౌనాన్ని దోసిళ్ళలో బంధించి

విషాద విహారంపై చల్లుతూ

ఆనంద రహదారికి వేలును చూపిస్తూ

నన్ను ముందుకు నడిపిస్తున్నావు

నా ప్రియ మధువనీ !

జన్మ జన్మకూ నాకు

జతగా ఉంటావు కదూ !?

## అగాధం
## సత్య

**అగాధం లోంచి చేతులు**

ఆకాశాన్ని చూస్తున్నాయ్
అంతు తెలుసుకుందామని.....
అర్థం చేసుకుందామని నేను!

అర్థం అయ్యేకొద్ది
అంతు పెరుగుతుంది.
లాక్కొచ్చిన ఆలాపన...
లోతు పెంచుతుంది !

ఏమీ తెలేని నా
ఎడారి బతుకే బాగుండేది
గమ్యం తెలీక పోయినా...
కనీసం ప్రయాణమైనా సాగుతుండేది!

కట్టిపడేసిన అలోచనతో
కుంచించుక పోయి లోయలో నేను.
ఆడదాన్ని అర్థం చేసుకునే యత్నంలో .....
లోతుతెలియని  అగాధంలో నేను!

## నయాగరా జలపాతం

### న్యాయపతి వెంకటమణి

**అది జలపాతమా**

ఆదిశేషుని వే యిపడగల హుంకారమా
కవులకందని కదనకుతూహల కదనమా
పొరపాటున నిటలాక్షుని జటవీడిన గంగ వీరంగమా
నిశ్శబ్దంలో నిదురించిన శబ్దతరంగమా
వే యినదుల ఝుర్ఝురీ తరంగ విస్ఫులింగమా
కోటి మృదంగముల మేటినాదమా
జంబూద్వీప జనిత ఘోషారావమా
రాగాద్వేషాజ్వలిత కోలాహలమా
తరంగ విహీన హృదయాంతరంగమా
విరించి సతి మీటిన విపంచి నాదమా
ఊహకందని ఉత్తేజం
భాషకందని భావోద్వేగం
ధ్వని నిండిన మౌనభాష్యం
శబ్దంలో నిశ్శబ్దం
వడిలో వరవడి
తుంపరల తూణీరాలు
తనువుకు మృదులాలు
మనసుకు మధురాలు
నయనాలకు నయగారాలు
తపోదీక్షకు అనుకూలాలు
నిలచి నిలచి చూస్తే దృష్టికి ఝురి నీలాలు
తరచి తరచి చూస్తే మిథ్యా సృష్టికి మూలాలు
అవే నయగారా జలాలు

## రాగబంధం

### రాళ్ళపల్లి రామసుబ్బారావు

**వేణువుకు మోహన రాగానికి మైత్రి**

వేకువకు భూపాలానికి సంబంధం ,
వీణకు కదనకుతూహలానికి అన్యోన్యత
సప్తస్వరాల గాంధర్వ విద్య సంగీతం ,
సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము
వేదమె సామ సంహిత భారత సంగీతము ,
సామగాన లోల మనసిజ లావణ్యము
ముముక్షువులకు మోక్షసాధనము ,
మహాదేవుడి సప్తముఖములు
వామదేవ, అఘోర తత్పురుష ,
పరమశివ, ఈశ్వర, సద్యోజాత
ఈశానలే స్వరాల జన్మస్థానాలు ,
షడ్జమం, రిషభం, గాంధారం
నిషాదాలే 'స రి గ మ లు' ,
మధ్యమం, పంచమం, దైవతం
సప్త గ్రహములకు అనుబంధాలు ,
శుద్ధ మధ్యమము శంకరాభరణము
ప్రతి రాగానికి ప్రత్యేక జీవస్వరం ,
కల్యాణిలో ప్రతి మధ్యమము
వివిధ రంగులతోను సంబంధము ,
దేహానికి తెలుసు సంగీతసారం
రాగంతో రోగం కుదుర్చుకోవడం ,
జీవధాతువులు పిల్చుకునే స్వరచైతన్యం
మానవాళికి మేలైన చికిత్సావిధానం ..!!

# అమ్మవారు

డా.నారాయణ గరిమెళ్ళ



**అప్పటి వరకూ**
అందరిలా ఆమెకూ రెండు చేతులే!
అమ్మయ్యాకే
అమ్మోరిలా అనేకానేక చేతులు మొలచుకొచ్చాయి!
గూడు కట్టి గుడ్లు పెట్టినది మొదలు
పిల్ల గువ్వల నోళ్ళల్లో బువ్వ పెట్టే వరకూ
తపన పడే తల్లి గువ్వలా!
ప్రేమకోసం బాధ్యతలు మోస్తూ
బాధ్యతలెన్నైనా ప్రేమేగా ప్రయాణమంటూ
ఆమె చేతులన్నీ చేతనలోనే తలమునకలవుతూ ఉంటాయి.
ఆదరబాదరగా ఇంటి పనంతా చక్కబెట్టేది ఒకటి
ఆఫీసు పనుల్లోపడి అలుపుసొలుపులను సైతం
లెక్కచేయకుండా ఆరితేరిపోయేది మరొకటి
పాపాయిని పొదవి పట్టుకుని
ఆడించి పాడించి ఆలనపాలనలు చూసుకునేది ఇంకొకటి
ఇంకా ఎన్నెన్ని చేతులో!.
లేచింది మొదలు కునుకు తీసే వరకూ
రోజు మొత్తంతో విక్రమార్కుడిలా యుద్ధం జరుపుతూ
ఛేదించుకు పోతుంటాయి!
ఎప్పుడూ తనతో తనే పోటీ పడే ఆమెకు
చక్రంలా తిరుగడమూ తెలుసు.
చక్రము తిప్పినట్టు
చేతులన్నీ అలవోకగా తిప్పడమూ తెలుసు. !

## కవి
సత్య

**జిలిబిలి జాబిలి వెన్నెల-వన్నెలు పొగడని కవి లేడు.**
నిశీధి నిశ్శబ్ద  ఒంటరి రాతిరి గడపని కవి లేడు.
స్పందన-నదికి అశ్రువు  తోడుగ వదలని కవి లేడు
పుప్పొడి-తుమ్మెద వెంబడి మదితో కదలని కవి లేడు.
విశాల విశ్వపు తారల మెరుపులు,
మదిలో ఊరిన కమ్మని తలపులు,
సిగ్గులో దాగిన తొలకరి వలపులు,
కాగితంపై సిరాకలంతో విడువని కవి లేడు.



## జైలులో ఓ చిన్ని ఎలుక
## (చిన్ని జియా కోసం)

**ఇనుప ఊచల నడుమనుండి**
ఓ చిన్ని ఎలుక దూరుతుంది
కిటికీ అంచున
ముందుకూ వెనుకకూ
పారాడుతుంది
పెచ్చులూడిపోతున్న గోడలు
తనని గమనిస్తున్నాయి
గగనం నుండి చందమామ
దృష్టిలో కూడా పడ్డాడు
విమానంలో ఉన్నట్లు
సౌందర్యాన్ని వంపుతున్నాయి
వెండి వెన్నెల నీడలు
అతి మర్యాదస్తుడు  చిన్ని ఎలుకగారు
ఈ రాత్రి
ఏమీ తినరు, తాగరు
పళ్ళు కూడా కొరకరు
మెరిసే అతని కొంటె కనులతో
వెన్నెలలో
పచార్లు చేస్తూ
కళ్ళప్పగించి చూస్తున్నారు

***చైనా మూలం: లీ జియాబుఓ***
***ఆంగ్ల సేత: జేఫ్స్రీ  యాంగ్***
***తెలుగు సేత: జగద్ధాత్రి***

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత లీ జియా బుఒ కవిత ఇది
అతను  చాల గొప్ప కవి అని చాల మందికి తెలియదు
కేవలం మానవ హక్కుల పోరాటశీలి అని మాత్రమే తెలుసు
అందుకే ఈ చిన్ని కవిత మిత్రులకోసం.
ఈ కవితా శీర్షిక జియా అతని భార్య.

# కరుణార్ద్రులు

బెల్లూరు సాంబమూర్తి

**భువన గర్భపు చిరుజీవై అంకురించినపుడు**
ఈ పద్మవ్యూహపు కథా కమామిషు
వారి స్మృతి పథంలో రికార్డు కాకపోలేదు
సింథటిక్ చిరుతిళ్ళు కొసరికొసరి తినిపిస్తూ
చదువుల మూటలు
వీపున మోసే కూలీలుగా మారుస్తూ
వారి ఆశల్నీ,ఊసుల్నీ
ఆలోచన మొలకల్నీ
ఆదిలోనే తుంచేస్తున్నాం
రేంకుల ఎరలను చూపి
వాళ్ళ బాల్యపు బంగరు తునకల్ని
దొంగిలిస్తున్నపుడు
వాళ్ళ కళ్ళలోని దైన్యాన్ని సైతం
మన కంటిరెప్పలతో కత్తిరిస్తాం
వాళ్ళ కేరింతల సాయంత్రాలతో
మనం గూటీ బిళ్ళాడుతున్నపుడు
ఎవరో కొట్టిన బౌండరీల వైపు
నిస్సహాయంగా చూడకేంజేస్తారు
ఇది ఇక్కడ.......నీ పక్కన
మాతృమూర్తి ఒడిలోని శైశవగీతాల్ని
మర ఫిరంగుల ఘర్జనలు
కబళిస్తున్నాయొకచోట

అమ్మ చేతి బొటనవ్రేలిని
ఏనాడూ స్పృశించని
చిన్ని పెదవులపై
కన్నీటి చారికలింకోచోట
తుమికాకు మడతల్లోని బాల్యం
చేయందివ్వని శాసనాలవైపు
నోటికందే చేతివైపూ
అయోమయంగా చూస్తుంది మరోచోట
మీ వివాదాలూ,విభేదాలూ
శాసనాలూ,చర్చా వేదికలూ
ఏమీ ఎరుగని పసితనం
అమాయకంగా సంధించిన శరపరంపర
ఎప్పటికీ మీ కంటి కుహరాల్లోంచి
పయనిస్తూనే ఉంటుంది
మీ మనో ఫలకంపై
క్వశ్చన్ మార్కులై మొలకెత్తటానికి
మధుర స్మృతిగా మార్చాల్సిన బాల్యం
కాంక్రీటు కొలమానాల పాత్రల్లో నింపినా
అరులు చాచిన ఆకలి కేకల్ని అదిలించినా
ఆ బాల్యం..........
కాలం చెక్కిళ్ళ మీద
ఘనీభవించిన కన్నీటి చుక్కవుతుంది

# కలల వెలలు

కుంతి

**జననీ జనకుల ఆశయసౌధ నిర్మాణ**
సాధనలో బాటసారినేను!
నన్ను నేనెరుగని నును లేత ప్రాయాన
ఆవాస జగతికి అతిధినేను!
పసిప్రాయమందున బంగరు భవితకై
బడిగుడి చేరిన బుడుత నేను!
నాదికాని పలుకు ,నానోట కోరగ
పలుకుచు తిరిగెడు చిలుక నేను!
ఆటలు పాటలు, అల్లరిచేష్టలు
కొసరిపెట్టే అమ్మగోరు ముద్ద!
కరకర జంతికల్ ,కారపు పూసలు
వేలు మడిచి నాకు వెన్నముద్ద!
ఉట్టిపైని పెరుగు, ఉల్లితో తరువాణి
అన్నపు అంచున ఆవబద్ద!
గొట్టికాయలు, కోతికొమ్మచ్చి క్రీడలు
పక్కింటి బండోడు , పప్పుసుద్ద!
సోదర ప్రేమలు, వీధిలోనేస్తాలు
తాతయ్య గారాలు తడుపు ముద్దు!
పచ్చని పొలములు,పైరు షికారులు
చక్కనౌ మాయింటి దుక్కిటెద్దు!
అంబారవమువిని ఆటలు వీడుచు
చల్లగా ఇలుచేరు సందెపొద్దు!
చెరువులో ఈతలు, చేపల వేటలు
సంతసానికి ఆకసమ్మె హద్దు!
ఎటపోయెనోకదా? ఇటకేగిన దినము!
ఎటుచేతునొ? బతుకు పటుసమరము!

కడివెడు దు:ఖము కడుపున కడుభీతి
కన్ను నీరుతుడువ -నాన్నలేడు!
తడబడు అడుగులు ,తత్తరపాటులు
ధైర్యము చెప్పగ - తాత లేడు!
చిక్కటి రాత్రులు, చిక్కటిభయాలు
అక్కున చేర్చగ - అమ్మలేదు!
నిదుర దూరమయిన నిశిరాత్రివేళలో
పాటలు పాడగ -బామ్మలేదు!
ఒంటరి వేళలు, తుంటరి మిత్రుల
తెంపరి లీలలు - తెగువలేదు!
తెలియని భయాలు, తలువనిరోగాలు
గోడు చెప్పుకొనగ -తోడులేదు!
పంతులు చెప్పిన పద్యాలు చదివినా
పరిపరి విధముల భయము పోదు!
హాస్టలు చదువులు అష్టకష్టమ్ములు
పలుమాటలేలనో బ్రతుకు చేదు!
శిక్షణ పేర పరీక్షలు,శిక్షలు
విద్యాలయమ్ములు వధ్య శిలలు!
ఎందుకో తెలియని ఇంతింత పరుగులు!
అలభావి వేటలో కలల వెలలు!
(పసిప్రాయములోనే అమ్మానాన్నలను వీడి, హాస్టలులో చేరిన చిన్నారుల మనోగతం)

# కలహాంతరిత

ప్రొ.కె.వి.ఎస్.జ్ఞానేశ్వర రావు

చం. నను గికురించి కోపమున నా ఎడ ౘాల్మి యొకింత లేక నీ
వనుదినమున్ మదీయ హృదినంచెలుగా పెకలించి ౘోయెదో
కనికరమేలరాదు? నను కత్తుల బోనున ౘ్రోసిపోవకే
వినిమొర! ప్రేమ మీర నను వీనుల విందుగ ౘల్కరింపవే!......

చం. అలరుల పాన్పుపైన నను నర్మిలి ప్రేమపయోధిౘేల్చి, నీ
వలిగిన వైనమున్ మరచి యక్కున జేరిచి ఆదరించవే
నలినదళాక్షి! నీదు నయనమ్ముల వెన్నెలసోనలీనగా
చెలి! నను చేరదీసి నునుచెక్కిలి నొక్కుచు ముద్దుచేయవే!......

చం. అరవిరితావి నెయ్యమది యంత త్రుటిన్ మది ౘాసిపోవునే
వరమది వేయి జన్మలకు వమ్మగునే! చెలి కిన్కబూనునే!
చిరముగ షాంతి సౌఖ్యములు చిందకపోవునె? వన్నె తగ్గునే?
తిరముగ యమృతంపు క్షమ చిప్పిల ప్రేయసి కౌగిలించునే?.....

# మౌనం

ప్రవీణ కొల్లి

**లిపి లేని భాషలో,**
లిఖించిన మహాగ్రంథం,
అంతులేని అధ్యాయాలు,
అర్థం అయ్యీఅవ్వని పదాల కూర్పులు.
వధువు మౌనం,
సిగ్గుతో కూడుకున్న అంగీకారమా?
పైకి చెప్పుకోలేని తిరస్కారమా?
భర్త ప్రశ్నకు భార్య మౌనం,
ఎదురు చెప్పలేని సమాధానమా?
ఎదురు అడుగుతున్న ప్రశ్నా?
భర్త పురుషాంహకారానికి భార్య మౌనం,
తరతరాలుగా వస్తున్న కొనసాగింపా?
నేటితరంలో వచ్చిన ముగింపా?
అత్తింటి ఆరళ్ళకు కోడలి మౌనం,
ఓపికకు వరమా?
ఓర్చుకోలేని శాపమా?
ఎదిగిన బిడ్డ ఎగిరిపోతున్న వేళ,
తల్లి మౌనం,
ఎదిగాడన్న సంతోషమా?
ఎగిరిపోతున్నాడన్న విచారమా?
మహిళకు మౌనం,
అలంకరణ అవసరం లేని అందమా?
అలకరించినా అందంగా లేని వికరమా?
మౌనం,
అర్థం అయినట్టే ఉంటూ,
అర్థం కాని అనంత విశ్వం.

## పరిపూర్ణత
### చంద్రుపట్ల తిరుపతి రెడ్డి

**ఎంత నీవు నేర్చినావు?**
ఎంత నీవు ఎదిగినావు?
తోటివారు లోని బాధ
ఎంత నీవు చదివినావు?
గమ్యాన్నే చేరాలని
పరుగు తీసి పరుగు తీసి
కూర్చుకున్న సంపదలో
చరమ దశను కడ తేరగ
ఎంత నీవు దాచినావు?
శరణార్థుల బాధ తీర్చ
ఎంత నీవు పంచినావు?
ఈ జీవన పరిమాణం
చారిత్రక పరిమితిలో
చిన్నదైన క్షణకాలం
అనుక్షణమూ ఉన్నదాన్ని
ఎంతెంతో పెంచాలని
ఎందులకీ ఉబలాటం?
సేద దీరి అందరికీ
సాయ పడగ దీక్షబూని
పాలుపంచు ఒక్క క్షణం
ఇది జీవిత పరమార్థం
జీవితమిక పరిపూర్ణం..!!

## ఉగాది నేనై
### న్యాయపతి వెంకట మణి

**అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది**
కోయిలకూతను నేనై వీనులవిందు చేయాలని
మల్లెల తావిని నేనై సుగంధం కురిపించాలని
మలయ మారుతమే నేనై మనుషుల సేద తీర్చాలని
స్వాతి చినుకును నేనై మట్టి సువాసన నందించాలని
చిరుజల్లును నేనై చల్లదనం చేకూర్చాలని
జడివానను నేనై ధరిత్రి సస్యశ్యామలం చేయాలని
అప్పుడప్పుడనిపిస్తుంటుంది
నిండుపున్నమి నేనై పండువెన్నెల పంచాలని
నదీమతల్లిని నేనై నీటికొరత తీర్చాలని
శాంతి దూతను నేనై విశ్వశాంతి సమకూర్చాలని
పసిపాపను నేనై బోసినవ్వులందించాలని
పండు ముదుసలి నేనై అనుభవం పంచిపెట్టాలని
ఇంకా
ఎప్పుడూ అనిపిస్తుంటుంది ఉగాదినే నేనై
యుగాంతం వరకు సమతను సర్దాలని



# కవిని

డా.కిషోర్ కుమార్

**కవినోయి నేను కవిని!**
రవిని, శశిని, నిశిని
కలిపివేయగల ఋషిని!
కవినోయి నేను కవిని!
మనిషిని, మనసుని
కలల్ని, నిజాల్ని
నమ్మకాన్ని, వాస్తవాన్ని
జోడించి చెప్పగల మానసిక శాస్త్రజ్ఞుడ్ని!
కవినోయి నేను కవిని!
వేదాన్ని, జీవిత సారాన్ని
అంతులేని మర్మాన్ని
వివరించే వేదాంతిని!
కవినోయి నేను కవిని!
చీకటికి రంగులు అద్దగల చిత్రకారుడ్ని
క్షణంలో వయ్యారులను సృష్టించగల శిల్పిని
కవినోయి నేను కవిని!
కలాన్ని పొలం బాట పట్టిస్తాను
పదాల్ని కవాతులు చేయిస్తాను
పంచభూతుల్ని స్పృశిస్తాను
చతుర్వేదాల్ని వల్లిస్తాను
కోయిల గానాన్ని ఆలకిస్తాను
సప్తస్వరాల్ని పలికిస్తాను!
కవినోయి నేను కవిని!
విప్లవశంఖం పూరిస్తాను
వెన్నెల హాయి కురిపిస్తాను
సుఖంలో హాయినౌతాను
దుఃఖంలో ఓదార్పునవుతాను
విహంగంలా విహరిస్తాను
సముద్రపు లోతులకు చేరుతాను!
కవినోయి నేను కవిని!
ఏ జాతినైనా ఆదరిస్తాను
ఏ మతాన్నైనా ఆచరిస్తాను
దేశదేశాల సంచరిస్తాను
మనిషి మనిషిని పలకరిస్తాను
మనసు మనసుని తాకి వస్తాను!
కవినోయి నేను కవిని!
తత్త్వాన్ని చెబుతాను
సత్యాన్ని ప్రభోధిస్తాను
నిజానికి కాపు కాస్తాను
అవినీతిపై యుద్ధం చేస్తాను!
కవినోయి నేను కవిని!
కార్మికుడి కష్టంలో నేనే
శ్రామికుడి స్వేదంలో నేనే
ఆకలిలో నేనే
ఆవేశంలో నేనే
అంతరంగంలో నేనే
గళంలో నేనే
పేదవాడి అవేదనలో నేనే
ధనికుడి అహంలో నేనే!
కవినోయి నేను కవిని!

# అమ్మ

## రఘుకుల తిలక్

**సృష్టికి మూలం బ్రహ్మ**
ప్రతిసృష్టిని చేసినదమ్మ
వాడని మమతల కొమ్మ
యెద గుడిలో దేవత బొమ్మ
భువిపై ప్రతి ఒక్కరు పలికే తొలిపలుకే అమ్మ
రవిచంద్రుల మించి వెలుగులు పంచేదే అమ్మ
ప్రతి విజయం వెనక ఉండే తొలిగురువే అమ్మ
ఏం చేస్తే ఋణమను శిఖరము తరిగేనో చెప్పమ్మ
ఆకలి తీర్చును అమ్మ, ఆప్యాయత పంచును అమ్మ
దేవుడి కానుక అమ్మ, అనురాగపు తూనిక అమ్మ
పసితనమున ఎరుగక నిన్ను, ఈ కాళ్ళతో తన్నానమ్మ
ప్రతి తన్నుకు పెన్నే కడుతు, దీవెనలను ఇచ్చావమ్మ
గురుతున్నది ఇంకా నాఖు, గోళ్ళతో నిను గిచ్చానమ్మా
ప్రతి గిచ్చుకు చిత్రంగా నువు, చిరు నవ్వే నవ్వావమ్మా
దైవమే నాకెదురుగ వచ్చి కోరికే కోరమని అంటే
జన్మమే ఏదైనా కాని, తల్లిగా నువ్ కావాలంట
లోకమే ఒకటై ఇటు వచ్చి అద్భుతం చూపించమంటే
జాగు నే క్షణమైనా చేయక నిన్నే నే చూపిస్తానంటా
మాతృమూర్తి, క్షమలో ధరిత్రి నీకిదే నా వందనం, నీకిదే నావందనం! (సృష్టికి మూలం)
మరువను నేనెప్పటికైనా నిను పెట్టిన బాధలు కొన్నీ
ప్రతిబాధకు వడ్డీతో ఆనందాన్ని పంచావమ్మా
ఆరళ్ళే పెట్టానమ్మ అత్తను మరిపించానమ్మా
నేరాలను క్షమియించి నను ప్రేమతో నువ్ పెంచావమ్మా
సంశయం నా మనసుకు ఒకటే , నేనే నీకు అమ్మగ పుడితే
కొండంత నువ్ పంచిన ప్రేమలో, చిటికెడైనా పంచగలుగుదునా
ఆశయం నా మనసుకు ఒకటే, ఆ క్షణం ఎపుడొస్తుందో
నవమాసాలు మోసిన తల్లికి, గర్వించదగు తనయుడనౌదౌనని
పరమ పావని నా ప్రియ జనని నీకిదే అభివందనం, నీకిదే అభివందనం!! (సృష్టికి మూలం)



# నువ్వు

సాంజీ శ్రీరామ్

**నిన్నటి వరకు 'నేను' ఒక్కడినే**
నువ్వొస్తే ఇద్దరం అనుకున్నా
కానీ..అదేమో తెలీదు
ఇన్నేళ్ళుగా ఒక్కడిగా ఉన్న నన్ను నువ్వు అబద్ధం చేశావ్
నా సగమై నీ ఆగమనంతో ఒక్కసారిగా నను 'అర్థం' చేశావ్
రెండో సగం వచ్చిచేరిందా??
లేక ఉన్న సగం మాయమైందా? అని ఆలోచిస్తే
నాలోని సగమే దూరమైందని తెలిసింది
దూరమైన ఆసగం పేరు నా అహమని  తెలిసింది
అమ్మ, నాన్నలకు వదిలొస్తావు
అన్నీ నేనేనని భావిస్తావు
అంతశోకాన్ని మోస్తూ కూడా
ఈ కొత్తలోకాన్ని ప్రేమిస్తావు
నా ప్రాణమా..ఇది నీ ధైర్యమా లేక ధర్మమా?
నా ప్రియతమా..ఇది నీ వైనమా లేక వరమా?
గొడవ పడితే ఇట్టే ఉడికి పోతావు
ఘడియలోనే ఒడిలోకి వాలిపోతావు
గెలుపు నాదని తెగ విర్రవీగే నాకేసి
పిలుపుకోసం వెర్రిగా వేచి చూస్తావు
తప్పు తెలుసుకుని తల దించుకుని ఎదురుగ నిలబడితే
చల్లని చేతుల తాకిడితో నా తల్లినోసారి తలపిస్తావు !!
అడగకనే అన్నం పెట్టే అమ్మవి నువ్వు
సామెతకి , సాహిత్యానికి అందమే నువ్వు
పిలిచే ప్రతి పిలుపుకి బదులువు నువ్వు
మౌనానికి మాత్రమే తెలిసిన వర్ణన నువ్వు!!



# వేటగాడు - గరిమెళ్ళ నాగేశ్వర రావు

**పంజరాన్ని ప్రేమించే పిట్టకి**
రెక్కల విలువ తెలీదు
నీతి తప్పిన మనిషి నీటిని వదిలిన చేపే!
పట్టిన చేతినే వేటాడడం కత్తి నైజం
నెత్తురు త్రాగితే ..కక్కక తప్పదు!
మున్నీటి ముంపు కంటె కన్నీటి ముంపుకి
కసి ఎక్కువ!
వేటంటే విల్లంబులు పట్టి
మృగాలవెంట పడే వినోదం కాదు-
ఆకలి చూపులు సంధించే ఆయుధాల గురి!
వేటంటే మృత్యువునోట బ్రతుకు పాడిన వేలంపాట
తల్లడిల్లిన తల్లి గొంతు శృతిచేసే తడిపాట!
గుంటనక్కలని గురి చూసే చావాట!!
జీవితాన్ని ఎరవేసి పాపాలను పట్టుకునే త్యాగాల బాట!
వెంటాడే వాళ్ళను తప్పుకుంటూ వేటని
సాగిస్తోన్నప్పుడు..ప్రాణమే ఒక బాణం!
కాలం బొమ్మాబొరుసులకు మధ్యన
తిరుగుతోన్న ..ఒక నాణెం!
నేనొక వేటగాణ్ణి చూశాను,
ఆయుధాలు పట్టని అద్భుత నైపుణ్యాన్ని చూశాను,
గాయపరచకుండా గురిచూసే గుండె ధైర్యాన్ని చూశాను,
నెత్తురు చిందకుండా మృగాలని తరిమికొట్టిన వేటని చూశాను,
మూడురంగులుగా ఎగురుతోన్న వేటగాడి నవ్వుని చూస్తున్నాను,
ఆ అడుగుల్ని వెదికి పట్టుకు..వేటని మొదలెడదాం..
ఆయుధాలని మార్చుకోవాలి...అర్జంటుగా రా తమ్ముడూ..!

# వర్షం
## రాధిక బుక్కా

**యాదృచ్ఛికంగా ఎటో చూసిన నాకు**
కనిపించాయి నిన్నటి రాత్రి గుర్తులు
పుడమితల్లి దోసిళ్ళలో నేలజారిన అమృత బిందు సమూహాలు
నీలి మేఘాలు తమంత తామై కరిగి
నింగి నుండి నేలకు వేసిన నీటి నిచ్చెనలుగా
చల్లని స్పర్శల పలకరింపులతో వీస్తున్న గాలి తెమ్మెరలు!
నిత్య యవ్వని ఐన ప్రకృతి కాంత మేనిపై
స్నానమాడగా మిగిలిన ముత్యపు చినుకులు
బాలభానుడి లేలేత కిరణాలతో
మురిసి మెరుస్తున్న వజ్రపు తునకలు

అలవోకగా అటే చూసిన నన్ను
పులకింప చేశాయి నిన్నటి రాత్రి గుర్తులు
సేదతీరి శాంతించాయి నా ఎదకొలనులోని అలజడులు..!!

# నా..ఉగాది
## సి.హెచ్.నాగభూషణ రావు

**నా..ఉగాది**
సంతోషపు సంవత్సరానికి నాంది పలికే పునాది
ప్రకృతి కమనీయ పచ్చగా వుండాలని
కోయిలమ్మ గీతాలు తెలుగువారికి తియ్యదనం పంచాలని
ఉగాది పచ్చడి కష్ట సుఖాలను గుర్తుచేస్తూ..
ముందుకి..మునుముందుకి..నడిపించాలని
ఇది నా ఉగాది కామన..
కాలకన్య అందించే శుభ దీవెన!
పుడమి తల్లి ఒడిలో
ఆకు రాల్చిన నూతనత్వాన్ని
అంకురం చేసుకునే అందమైన ప్రకృతి ..
తెస్తుంది ఓ ఆకృతి
కాదది మోడు..చిగురించును చూడు..
నా..ఉగాది నాడు!
షడ్రుచుల సమ్మేళనం
కావాలి సర్వజీవులకు ఆనందం
అందరి హృదయాలలో
ఆనందపు కాంతులు నింపాలి ఈ ఉగాది..!
అదే అందరికీ శుభాది..!

# ఈ యుగం .. ఓ దారుణం..

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

**మంచికి కంచెకట్టి**

కాపాడాల్సిన పరిస్థితి
నిజాయితీని మ్యూజియంలో
వీక్షించాల్సిన దుస్థితి
మాటకు..చేతకు పొంతనలేని
కపట సంస్కృతి
నమ్మకం అనేది నామ రూపాల్లేక
మానవత్వం నశించి
మానవ బాంబుగా అవతరించి
నరమేధానికి..పరమఘోరానికీ
నాంది పలుకుతుంటే
రక్తం నిరంతర జీవనదై పారుతుంటే
అడుగడుగునా అంగాంగాలతో
కబేళాగా మారిన భూమిపై
రాక్షసత్వమే తప్ప
వెతికి చూసినా దైవత్వం గోచరిస్తుందా?
రక్తమాంసాల రుచి చూసిన ఈ యుగం
చరిత్రలో ఓ దారుణం..!!

# జీవితం ఓ దీపారాధన

జె.బి.వి.

**నే నొక దీపాన్నై**

నేనే నొక దీపాన్నై
ఉజ్వలమై , ఉద్భాసితమై
లోలో , నాలో చెలగే
తిమిరావళి నధిగమించి
ఒక దీపం వెలిగిస్తా !
ఆ దీప కళికలో
వెలుగులు చిందించే
ముఖారవిందం కని
మరినొక దీపం వెలిగిస్తా !
మరినొక దీపం
మరినొక దీపం
వేరొక దీపం
ఎన్నో , ఎన్నో
ఎన్నెన్నో దీపాలు వెలిగిస్తా !
జీవితమే దీపారాధన
ఉత్సవంగా మలచుకొంటా !!

# నేను చెల్లూరు సాంబమూర్తి

**నా కళ్ళ క్రింది బావులూ**
ఆలోచనా అంతర్వాహినిలూ
ఎపుడో అడుగంటాయి
నా లోని తడితో
దాహం తీర్చుకోవాలనుకోవటం
వృధా ప్రయాస
కలల్ని కౌగలించుకున్నంత మాత్రాన
కొన్ని కోట్ల నయనాలు కురిపించే
కన్నీటి చారికలు చెరిగిపోవు కదా
అశృధారల్లో తడిసి ముద్దవటం తప్ప-
మీరంతా
అంతర్నేత్రాలతో చూట్టం మానేసినపుడు
నా చుట్టూ బిగుసుకుంటున్న
ముల్ల తీగలు కనిపించవు
నిలువెల్లా చిరునవ్వు లేపనం
పూసుకు తిరుగుతున్నా
నాకు మాత్రం తెలుసు
నేను
కాన్సంట్రేషన్ కేంపుల్లో
ఇరుక్కున్న బందీనని!
ఏ రోజుకారోజు నా బ్రతుకు
నేను కొనుక్కోవాలంటే
నన్ను నేను అమ్ముకోవటం
నన్ను నేను కొంచం కొంచం
చంపుకోవటం
తప్పనిసరవుతుంది!

ఎడముఖం పెడముఖమున్న
మూడు మృగాలను
ముద్రించుకొన్నందుకే
ఓ లోహపు బిళ్ళను
ఆత్మీయంగా స్పృశిస్తారే
నిలువెత్తు నాణాన్ని
నా రెండోవైపు చూడరెందుకు
క్రీనీడలో ఉన్నంతమాత్రాన
నాకు రెండోవైపు లేదనుకున్నారా?
సరే
కర్తవ్యం కాలి చుట్టూ పెనవేసుకున్నపుడు
పలాయన మంత్రం పఠించలేను కదా
అందుకే
ఇపుడు నేనో సోమయాజిని
అక్షర యజ్ఞ గుండంలో
సిరా చుక్కల్ని నిరంతరం
జారవిడుస్తూనే ఉంటాను!
నా వ్రేలి కొసలలో
అక్షరాలు పుష్పిస్తాయంటే
నేల పొరల్లో
నిక్షిప్తమవటానికైనా సిద్ధమే.. !!

# నిజంగా మనం
## సత్య

**కలిసుండీ, కలిసిపోలేకుంటే**
విడిపోవడం మంచిది....!
విడిగావుండీ, విడిపోలేకుంటే
కలిసిపోవడం మంచిది...!!

ఎటూతేలక, స్పష్టత లేక,
భవిత తెలీక, పరిణితి లేక,
విషయం తెలిసీ, వివరణ లేక,
నిజాలు తెలిసీ, నిగ్గు తేల్చక,

అగమ్యపయనం-ఎడారియానం
ఎండమావితో తీరదు దాహం!!
మనసులనెరిగీ, మనుషుల అహము!
ముందుతరాలకి తీరని ద్రోహం !!!

# సమన్వయాలు
## నూతక్కి రాఘవేంద్రరావు

**నాడు ఆనందపు అనుభూతుల**
వింజామరలు
నేడు నిట్టూర్పుల పొగల సెగలు
కాలగమన వేగంలో
వైవిధ్య భరిత అంతరంగ
వ్యత్యాసాల నడుమ నలిగి కనలి
ప్రేమ ఆప్యాయతానురాగాలు.
సున్నిత భావావృత విన్యాసాలు
లోపిస్తున్నాయి ఎక్కడో
సమన్వయాలు
మరుగునపడిన
వుమ్మడి జీవన వాస్తవాలు



## ఓ చందమామ
## జొన్నలగడ్డ నారాయణ మూర్తి

ఓ చందమామ ఓ చందమామ
నింగినుండీ నీవు తొంగిచూడంగానె
పొంగి సాగరుడంత పరవళ్ళు తొక్కాడు
ఓ చందమామ ఓ చందమామ
ఆకాశవీధిలో నీరాక చూసింది
ఆనందమున కలువ మోము వికసించింది
ఓ చందమామ ఓ చందమామ
కోటికాంతుల కొండ వేయి వెలుగుల లోయ
మిలమిలా తళతళా మెరిసిపోయాయి
ఓ చందమామ ఓ చందమామ
నదిలోనపడి నీదు కిరణాలు మెరిశాయి
మదిలోనపడి మధురభావాలు విరిశాయి
ఓ చందమామ ఓ చందమామ
నీ వన్నెచిన్నెలకు ఎన్నెన్నొ హృదయాలు
కలవరింతలతోటి తూలి సోలాయి
ప్రేమనౌకలనెక్కి పయనాలు చేశాయి
ఓ చందమామ ఓ చందమామ
తీరాలు చేరకనె తనివితీరకనె
మబ్బుగుర్రాలపై దబ్బుదబ్బున నీవు
తిరిగివచ్చేసరికి తెల్లారిపోయింది
ఓ చందమామ ఓ చందమామ

## మానవుడే మాధవుడు
## పొదిల రామకృష్ణ

అర్థం అవలేదా చుట్టూ ఉన్న ప్రపంచం?
స్వార్థం తలపాగా చుట్టిన ఈ సమాజం?
తోటి మనిషికి అన్నం, లక్షింతల ఆకలితో పస్తున్నా ఇయ్యం
దేవునికి దణ్ణం అక్షింతల పూజలతో పసుపున్న బియ్యం!
దేవుడట ఆయన!
పాళితోటి ఖాళీగా ఉన్నప్పుడు
నుదిటిరాతలు రాసి వింధ్యామరలతో శయనిస్తాడు!
పేదోడట ఈయన!
గాలి తిని ఆకలిగా ఉన్నప్పుడు
అరటి ఆకులు చూసి విందుకలలతో విలపిస్తాడు!
సృజించాడట విశ్వాన్ని! రచించాడట జగాన్ని!
పూజిస్తే వరాలివ్వడానికి నేటి నాయకుడా దేవుడు?
దూషిస్తే శపించడానికి మరో మానవుడా దేవుడు?
దైవత్వం కేవలం కల్పన!
అది నాలో భయం, నీలో ఆశ!
వాడి లోపం, వీడి శ్వాస!
ఒకడి నేస్తం, ఒకడి ఊహ!
నారు పెట్టి నీరుపోసి
పైరు పెంచి పంట పంచుకున్న మనిషేగా దేవుడు!
ఉట్టికొట్టి ధారపోసి, వెన్నదించి వేణువూది
నిన్ను హత్తుకున్న మనిషేగా దేవుడు!!

# అమ్మ వెళ్ళాక - డా.కె.గీత

**ఆరు నెల్ల తర్వాత మళ్ళీ**

గడియారం చప్పుడు ఇంటి గోడల్ని తీవ్రంగా తాకుతూ -
నిన్నటి దాకా ఏవేవో కబుర్లుండేవి
మాటల్లో ఏమి దొర్లినా
మనసుల మధ్య
అమ్మకు, నాకు మధ్య ఏదో ఆనందం పెనవేసుకునుండేది
తెల్లారి తన గదిలోకి వచ్చానా -
విడిచిన చలి కోటు, మఫ్లరు, గ్లోవ్స్ ఆప్యాయంగా తడిమాయి నన్ను
ఆమూల తన మంచమ్మీద నడుం వాల్చానా -
మెత్తని ప్రేమైక చేతులు నా చెంపలు నిమిరాయి
ఎయిర్ పోర్ట్ చెకింగ్ పాయింట్ లో
నా భుజమ్మీద కరడు కట్టిన అమ్మ కన్నీళ్ళన్నీ
నా కన్నీళ్ళై ఈ గది లోనే ప్రవహిస్తున్నాయి
ఓ ప్లాస్టిక్ పూల తీగో
సువాసన కొవ్వొత్తి దీపమో చూస్తే సంతోషపడిపోయి
తనకే కావాలని తపించేది..
ఎంత చిన్న కోర్కెలు..!
అమ్మ వున్న ఈ ఆరు నెల్లు
పిల్లలకూ నాకు మధ్య ఒక కొత్త అనుబంధం
మమ్మల్ని ఇంకాస్త దగ్గరకి నేస్తూ -
పసిపాప మాకు కొత్త ప్రాణమైంది
మేం ముగ్గురం ఒకే కేంద్రం నించి ఉద్భవించి
ఒక పుష్పానికి మూడు రేకులై ఒకర్నొకరు చూసుకుని మురిసిపోయే వాళ్ళం
చలేస్తే ఒకరి రెక్కల చాటున మరికళ్ళం దాక్కుని గువ్వ పిట్టలై కువకువలాడుకునే వాళ్ళం

కిటికీలో వెలవెల బోతున్న బొట్టు బొక్సు, మందుల పెట్టె
గదంతా బావురుమంటున్న సామాన్ల వెల్తి
ఏదో ఇల్లు ఖాళీ చేసినట్లు -
కాస్సేపు ఇంకెక్కడో ఉందిలే ..
నిశ్శబ్దంగా రాసుకుంటూనో
పుస్తకాలు చదూకుంటూనో
కాఫీని నెమ్మదిగా తాగుతూనో
అలా అపార్ట్‌మెంట్ చుట్టు అడుగులేస్తూనో -
గదిని ఖాళీ చేసినా మనసుని ఖాళీ చేయలేని నిస్సత్తువ
క్షమించు అమ్మా!
ఆరునెల్ల కంటే ఎక్కువ పరాయి దేశం పర్మిటించదు..!
ఒకసారి నీనించి విడిపడినా పుత్రికా రత్నం నీతో వెనక్కి ప్రయాణించదు..
అయినా చివరి నిమిషంలో వెనకే పరుగెత్తిరావాలనిపించింది
మళ్ళీ ఒకసారి నీ కడుపులోకి ప్రవహించి హాయిగా నిద్రించాలనిపించింది
ఆరునెల్లు సరిగా చేసినా?
సంతోషంగా గడవనిచ్చేనా?
ఆరురోజులై గడిచిన ఆరునెల్లలో
కనీస సంతృప్తిని మిగిల్చేనా?
ఏవేవో నిశ్శబ్దాలు
గడియారం చప్పుడు మాత్రమే గోడల్ని తీవ్రంగా తాకే
గదిలో -
ఏవేవో ఆలోచన్లు
గడియారం చప్పుడుతో పాటూ
గోడల్ని తీవ్రంగా తాకుతూ!



# ఎంతుంది కాలం మిగిలి?

జ్యోతిర్మయి మళ్ల

**అద్భుతం..అనంతం..అతిరమ్యం..ఈప్రకృతి**
మంచుకొండలూ సెలయేరులూ
వనసీమలూ చెట్టుచేమలూ
ఇసుకతిన్నెలూ సముద్రాలూ
ఆకాశం హరివిల్లూ
నెలవంకా తొలిసంధ్యా..
ఎన్నెన్నో అందాలు

అన్నీ చూడాలి.. వీలయినన్ని చిత్రించాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నా కాలం మిగిలి?

అఖండం..అగణితం..అద్వితీయం..మన సాహిత్యం
వేదాలూ శాస్త్రాలూ
పురాణాలూ ఇతి హా సాలూ
గ్రంధాలూ ప్రబంధాలూ
కవితలూ కావ్యాలూ
నాటకాలూ నానోలూ..
ఎన్నెన్నో జ్ఞానాలు

అన్నీ చదవాలి..ఎన్నో నేర్చుకోవాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నాకాలం మిగిలి?

అమోఘం..అపూర్వం..అతిమధురం..సంగీతం
శాస్త్రీయమూ లలితమూ
ఆంధ్రమూ అంధ్రేతరమూ
భరతమూ పాశ్చాత్యమూ
జానపదాలూ జావళీలూ
భజన్‌లూ ఘజల్లూ
ఎన్నెన్నో శ్రావ్యాలు

అన్నీ ఆస్వాదించాలి..కొన్నైనా అభ్యసించాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నాకాలం మిగిలి?

అపారం..అజరామరం..అతిసుకుమారం..ప్రేమ
కన్నవారు.. నాతోఉన్నవారు
బంధువులు స్నేహితులు
ఆత్మీయులు శ్రేయోభిలాషులు
తెలిసినవారు తెలియనివారు
ద్వేషించువారు దూషించువారు..
ఎన్నెన్నో బంధాలు

అందర్నీ ప్రేమించాలి..అందరిచే ప్రేమించబడాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నాకాలం మిగిలి?



# అదిగదిగో
## ప్రవీణ కొల్లి

**అదిగదిగో ఆనందం,**

చిటారు కొమ్మన మిఠాయి పొట్లం,
అదిగదిగో సంతోషం,
ఎగిరే పక్షుల రెక్కల మాటున మరి భద్రం,
అదిగదిగో మనశ్శాంతి గమ్యం,
అలల లయల హోయలలో తేలియాడే చందం.
అదిగదిగో మందహాసం,
సెలయేటి పరవళ్ళ కేళీవిలాసం,
అదిగదిగో విలాసం,
ఆకాశాన ఇంద్రధనుస్సు పరావర్తనం,
అదిగదిగో గమ్యం,
గగనాన మబ్బుతునకల పయనం,
అదిగదిగో విజయం,
పిల్లగాలి పలకరింపుల నిత్యచలనం,
అదిగదిగో జీవితం,
ధరణి సహనపు ఓదార్పుల నిట్టూర్పుల సంగమం,
రణరంగపు శౌర్య పరాక్రమాల వీరత్వం!!



# నేను
## సన్యాసి

**ఈ చిదంబరాకాశ వేదికపై**
సంకుచిత వామ పాదమ్మునెత్తి
తాండవము చేయు నటరాజ మూర్తి నేను
నాదు దక్షిణ  పాదమ్ము క్రింద నలిగి,
నశించు అపస్మార దనుజుండు గూడ నేనె.

ఒక్కతృటిలోనె వీరవిహారమొనర్చి
మానవాళిని కబళించిన సునామీని నేను
నాదు పరిష్వంగమ్ములో హాయిగా కనుమూసి
ఓలలాడిన మానవాళి  గూడ, నేనే

విశ్వసంపదనంత కబళించు వేయు
వైశ్వానరుడ మాత్రమే గాదు, నేను
విశ్వమానవ కళ్యా ణమునకు
తోడుపడియెడు విశ్వనరుడ.

నాది, నాది యని మతిచలించి, పరిభ్రమించు
జీవకోటికిపుడు "నేతి,నేతి" యన్న
గుణ పారమీయ, నా పర్యవేక్షణలో
ప్రకృతి మాత పరుగెత్తి వచ్చె నేడు.

*ఈ మధ్యనే వచ్చిన సునామీని తలచి,  స్పందించి వ్రాసినది*

# రింగు రింగు భామ

విజయ చావలి

**ముచ్చటైన రంగుల్లో**

పాకెట్లో జాకెట్లో

రక రకాల శబ్ధ స్వర సుభాషిత

చేతికీ చెవికీ సంతతభూషిత

రింగు రింగు మంటూ రొద చేస్తుంది

ఎచ్చట నుండో వచ్చిన ముచ్చట వినిపిస్తుంది!

వయ్యారి భామల చేతుల్లో

వేలాడే అందమైన బేగుల్లో

హుషారు కుర్రాళ్ళ చెవుల్లో

జీన్స్ పాంట్ పాకెట్లో బెల్టుల్లో

పురోహితుల మెడల్లో

పాలవాడి జేబుల్లో

ముసలివాడి సంచీల్లో

రింగు రింగు భామ తొంగి చూస్తుంది

రింగురింగు మంటూ రాగం వినిపిస్తుంది!

ఆప్యాయంగా పలకరించినా

అధికారంగా ఆజ్ఞాపించినా

నిదానంగా నిర్దేశించినా

నిరీక్షణతో నివేదించినా

ప్రేమ పలకరింపు పులకరించినా

అనుబంధ పిలుపు చిలకరించినా

వుత్సాహ వార్త వుద్దేశించినా

విషాద వార్త వినిపించినా

రింగు రింగు భామ అదే మొదటి రాగం ఆలాపిస్తుంది!

కిక్కిరిసిన జనారణ్యంలో

నిశ్శబ్ధ వాతావరణంలో

రింగు రింగు భామ ఎవరికి వారిని

రింగురింగు లోకంలో కట్టి పడేస్తుంది.!

# కలలు చెక్కిన శిల్పం

పెరుగు రామకృష్ణ

**మా దాంపత్యపు**
**కలలు చెక్కిన సజీవ శిల్పం నువ్వు**
మా అనురాగ శిఖరాగ్ర సంగమాల
ప్రణయలీలా విలాస పర్వం నువ్వు

నాఫాలాకాశ కేంద్రీయ సూర్య బింబం
అస్త మిస్తూ వొదిలి వెళ్ళిన జాడల్లోని
తొలి అడుగు చిహ్నం నువ్వు
నా ఏడు జన్మల సశేష దరహాసాల
సుమ సౌందర్య హేల పుంజం నువ్వు

శేష జీవన పార్శ్వ ంలో
నా మండుటెండల ఎడారిలో
బాధ్యతల గొడుగు పట్టే తోడు నువ్వు
నా సమస్యలతో నా కోసం పోరాడే
ఋణశృంఖలాల సైనికుడివి నువ్వు
కన్నీటి మేఘాల వర్షంలో
నేనణు మాత్రమయినా తడవకుండా
వీచిన చిరునవ్వుల ప్రభంజనం నువ్వు

ఆయన నా ప్రాణంలో ప్రాణమైతే
మా ఇరుప్రాణాల పరిచయ వాక్యం నువ్వు

కాలం కుబుసుం విడిచినప్పుడల్లా
రుతువులు పూల పెదవులు స్పృశించినప్పుడల్లా
సముద్రాల పెను ఘోషలో
ఆత్మలు ఆత్మీయుల్ని పేరు పెట్టి పిలిచినప్పుడల్లా
తామరాకుల మీది కోరికల బిందువులు
నా మనసుని మార్మికం చేసినప్పుడల్లా

నీ అమలిన చిరునవ్వుల్లో
ఆయన సాంత్వనని వెతుకుంటాను నేను
నా ఆత్మ విశ్వాసాన్ని పునురుద్ధరించుకుంటాను...

ఆయన నాకోసం
మిగిల్చి వెళ్ళిన జీవితం కొనసాగింపు నువ్వు..
నా ప్రాణాన్ని నిలబెడుతున్న ప్రాణ వాయువు నువ్వే..!

***



# వ్యయం

డా.గంద్రు లక్ష్మణరావు

**వ్యయం అంటే భయం దేనికి?**
వ్యయం లేనిదే అవ్యయమదెక్కడిది?
పండుటాకులు వ్యయం కానిదే
పచ్చనాకులు వచ్చునా
మావి చివురులు వ్యయం కానిదే
మధురగానం సాగునా?

సాగరమ్ములు వ్యయం కానిదే
జలధరమ్ములు నిండునా
సారమెంతయొ వ్యయం కానిదే
జనని ధరణియు పండునా

చెమటనీరు వ్యయం కానిదే
సిరుల వర్షం కురియునా
జనం ప్రాణం వ్యయం కానిదే
చరిత రూపం దిద్దుకొనునా?
మంచి నీరు వ్యయం కానిదే
మనకు ప్రాణం దక్కునా
బతుకు సొంతం వ్యయం కానిదే
బంధముల్ తెగిపోవునా?



# నెగిటివ్ గానే

దాసరాజు రామారావు

**హృదయానికి**

నాలుగువైపులా బార్లా తెరిచిన
తలపుల తలపులను
వెంటనే మూసెయ్
గది మూలల్లో
ఏ పులుగూ
పల్చటి, నునుపైన
రెక్కలెగరేసుకుంటూ
స్వరాగాల సవ్వడి
చెయ్యనీయొద్దు
సీలింగుకు వేలాడుతున్న ఫ్యాను
గిరగిరా తిరుగుతూ ,
దాన్ని చుట్టుకునే
సుడిగుండపు ఆలోచనల దుమారం
అంటిపెట్టుకుని వుంటే,
ఠక్కున స్విచ్ నొక్కేయ్
నిలువెత్తు పొగరుతో తల
ఎగరేయ వద్దని,
దర్జాగా, ఖరీదైన బీరాలు
పలకవద్దని
గ్రాడేజ్ బీరువా మూతికి ఎక్స్ మార్క్
లేబుల్ అతికించు
సేదదీరే డబుల్ కాట్‌తో పాటు
ఫక్కున నవ్విన పగటి కలల్ని,
చుక్కలు అలిగి మలిగి
చంద్రుని జాడ కానరాని,
అంత తొందరగా విరికాని
రాత్రి సమయాల్ని,
కాల్చి పారేసెయ్
గదంతా ఈదుతూ
అణువణువూ గాలించు
చీపురుపుల్ల దొరికినా
గండ్రగొడ్డలిగా మారుతుందేమో
ధూళి కణం కనిపించినా
అగ్గిరవ్వలా రాజుకుంటుందేమో
ఇస్త్రీ చేసి, మడత పెట్టిన
పట్టుబట్టల నుంచి
తలంబ్రాల వాసన వీస్తుందేమో
విరిగిన పెన్సిల్ ములుకులు,
అట్టలూడిన ప్రైమరీ వాచకాల పేజీలపై
అడ్డదిడ్డపు గీతలు,
నేను నేనంటూ
గుర్రం బొమ్మ గీయబోయి
గాడిదలా అయినందుకు
మూతి తిప్పుల్ల వెక్కిరింతలు.
తినుబండారాల అభాండాల సిగపట్లు,
బుంగమూతి మొహాల, అల్లరి చేష్టల
ఇల్లుపీకి పందిరేసిన పోలికలు
గదంతా వరించే వుంటయి

నాకు తెలియకుండా
నాకు కనిపించకుండా
మేనేజ్ చెయ్
అర్ధనేత్రాలు విప్పిన
నల్లతాచు రాత్రి పరదాల కదలికల మాటున
నాకు నేనే పూర్వపు పరిచయంలా
ఎదురు పడతానేమో
చిత్తు కాగితం ముక్క దొరికినా చూడు
అందులో అక్షరం రాసి వుంటదేమో
గాల్లో కలిసి
మబ్బుల ముషాయిరా తుఫానులు
సృష్టించొచ్చు
గదిని
నిర్మానుష్యం , నిరలంకారం, నిర్వీర్యం
నిర్దాక్షిణ్యంగా చెయ్
పాళీ పెట్టిన ఫుల్ స్టాప్ కూడా
గదిలో కనిపించొద్దు నాకు -
అంతా అయ్యాక
వెళ్తూ వెళ్తూ ఒక్కసారి
నా ముఖంలోకి
ఒక రెప్పపాటు నీ దయార్ద్ర చూపు బొట్టుని
ఒంపి వెళ్ళు
కత్తిగాట్లు వద్ద నా ముఖం
ఎప్పుడన్న నీ కలలోకొచ్చి , నిన్ను
గుచ్చి గుచ్చి ప్రశ్నలడిగి
సతాయించక పోతుందా-
గది బయట
తాళం బాగా వేసావో లేదో
తడిమి తడిమి చూసుకో
మళ్ళా తాళం తీయడం పూర్తిగా మరచిపోవాలి సుమా
ఇప్పుడు గదా
గదిలో నాకిష్టమైన
ఏకంత సామ్రాజ్య వైభవోన్నతం
నాకు నేనే సర్వం సహా చక్రవర్తిని
నాకు నేనే సర్వం సహా భిక్షవర్తిని
ఇన్ని యోజనాల ప్రయాణంలో మనిషి తన పాదముద్రలో
ఎన్నడన్నా బంగారు కాసులు
ఏరుకున్నాడా-
ప్రజాస్వామ్యమా అలంకరించుకో
పంచవర్ణ ప్రణాళికల ఏడువారాల
నగల పెట్టెతో-
శరీరం నుండి గుండెని తవ్వి,
తీసుకుని
అద్దంలా నా ముందు ప్రతిష్ఠించుకుంటా -
మనసారా
తనువారా
కనులారా
అద్దంలో ఎన్నో ఎన్నో సార్లు
అలలెగిరిపడుతున్న అంతరంగాన్ని
వణుకుతున్న చేతుల్తో పట్టుకుని
లాలించడానికి ప్రయత్నిస్తున్నా
నిజానికి స్వంత మరణాన్ని ఇలా ఎదురుగా చూసుకుని మురిసిపోవడం
ఏ కాలమిచ్చిన జడ్జిమెంట్ -
ఆకాశం మేల్కొన్న తర్వాత
రేపటి పేపర్లో ,
నలుగురు మూగిన గుంపులో ,
తలో మాటా ముచ్చట్లలో
నా చావుని చూద్దురు గానీ-
అయినా
ఒక తెగని నమ్మకపు జీవధార....
ఏ రెండు నిండు కన్నీటి బొట్లు
వలవలా రాలిపడినా
ఒక అనితర సాధ్యపు
అసంపూర్తి గమనం
ఒక్క మెట్టు ఎక్కినట్టే-

***

## విలోమం
పల్లపురము రాము

**చిరునవ్వుల కెరటాలపై**

జీవిత నావ సాగుతుంటే
కాలం పిడికిలి దెబ్బలకు
మనసు గాయమై
దుఃఖ ప్రవాహంలో
మునుగుతూ తేలుతూ
రక్త సిక్త మౌతుంటే
నూతన ఆశల సంకల్ప పరంపరలు సైతం
చీకటి మాయమౌతున్నాయి
ఎడారి కళ్ళలో
మొలకెత్తే కాంక్షల పచ్చ దనంపై
అనాలోచిత ఆలోచనా బిందువులు
ఎండమావులై వెక్కిరిస్తున్నాయి
అరువు తెచ్చుకున్న అంతరంగంలో
ఆశయాల హరివిల్లు ఉదయిస్తుందా ?
కలుపుమొక్కలు నిండిన హృదయంలో
ప్రేమవనం చిగురిస్తుందా ? ***



## ఎదగడమంటే
బెల్లూరు సాంబమూర్తి

**మన మూలాల్ని మన పాదాలతో**

మనమే అణగ ద్రొక్కటం కాదు
మనతోపాటు అత్యున్నత శిఖరాలకు
తీసుకుపోవటం!
ఎదగటమంటే
మనల్ని నిలువెల్లా అల్లుకున్న తీగల్ని
పుటుక్కున తెంచేయటం కాదు
కమనీయస్పర్శను
వాటికి కానుక చేయటం!
ఎదగటమంటే
చండ్రనిప్పుల నెగజిమ్ముకుంటూ
నింగిలోనికెగిరిపోవటం కాదు
మమతానురాగాల జలాంతర్గాములై
జనసంద్రపు అట్టడుగుపొరల్లో
పయనించటం కూడా!
ఎదగటమంటే
మానవత్వాన్ని,మనిషితత్వాన్ని
విసర్జించటం కానేకాదు
అవే నీ అన్నపానీయాలవటం!
ఎదగటమంటే
అంతరిక్షంలోనో ఆవలి వైపునో
ఆవాసం కాదు
నీ ఇంటికీ ప్రక్కింటికీ
పెరిగిన దూరాన్ని తగ్గించటం!
ఎదగటమంటే
నీ అస్తిత్వాన్ని కోల్పోయి
రూపాయిగా రూపాంతరం
చెందటం అంతకన్నా కాదు
నీ జీవితపు దస్తావేజుకి
విలువెత్తు సంతకమవటం ***

## ఉగాది కోయిల ఉద్వేగం
## జొన్నలగడ్డ నారాయణ మూర్తి

**అంతరంగ విభేదాలు ఇన్నిన్నా అనుకుంటూ**
వస్తూన్న ఉగాది విస్తుపోయి చూస్తూన్నది
ఆమని కోయిల కూడా ఉద్వేగంలో ఉన్నది
అందరికీ నచ్చేలా పాడేదెలా అంటున్నది
మధు మాసారంభంలో
విధిగా పాడాల్సిన నాకు
పెదవి కదలకున్నదన్నది
వదిలి పెట్టేయండన్నది
వసంతకాలం రాగానే వనాంతరాలనుండి
దిశాంతాల దివ్యగానం వినిపించే కోయిలనేదో
అశాంతి ఆవహించినట్లున్నది
అసలు నేనెందుకు పాడాలంటున్నది
వగరై సగటు మనిషి జీవితముంటే
పగతో రావణకాష్ఠాలెన్నో రగులుతు ఉంటే
చిగుళ్ళెలా ముట్టగలనని
చిన్నబోయి చూస్తున్నట్లున్నది
తెలుగు తేజం బూజుపట్టి కళ తప్పిన వేళను
ఉప్పెనలా ఉద్రేకాలు ఉవ్వెత్తుగ లేస్తుంటే
తప్పులు లేకుండా తెలుగుపాట
ఇప్పుడెలా పాడమంటారని ప్రశ్నిస్తున్నది
మిగిలుంటుందా తెలుగని దిగులున్నది నాకన్నది
దిగి రండి దీక్షపూని రక్షించండన్నది
చెయ్యాలి ఈ తియ్యని భాషకు సేవలు మీరెన్నో
చెయ్యీ చెయ్యీ కలుపుతు రా రమ్మన్నది
తెలుగు తేనెవాకలు కాగా వెలుగుల్ని వెనకటిలా విరజిమ్మాలన్నది
కలకాలం నిలిచేలా పాటకు ప్రాణంలా తెలుగు మాటలు రాసిస్తేనే
పలుకును నా నోటనపుడు శృతీలయలు తప్పని
నిలబడి మిగిలిపోయే సిసలైన తెలుగు పాటన్నది

***

## అనామిక
## సత్య

**నీ చూపుల ప్రశ్నలకి నా మాటల జవాబు లేనపుడు**
నీ మాటల ప్రశ్నలకి నా ప్రవర్తన - సమాధానం కానపుడు
నీ నీడగ  సాగల్సిన సమయాన  నేనీడనే ఆగినపుడు
నీ మౌనాన్ని చీల్చి, నా మాటని పలికించలేనపుడు
నీ వొదిలిన నీట్టూర్పు శ్వాసల నిరాశని నేనాపలేనపుడు
నీ ఒంటరి ఆలోచనల తుంటరి వేగాన్ని నేనందుకోలేనపుడు
నీ గొంతు మింగిన గాలి గుటకల సహనాన్ని నేనోర్వలేనపుడు
నీ సిగ్గుబిడియాల సిరి సంపదని నేనర్థం చేసుకోలేనపుడు
నీ మోమున మొగమాటానికి నామొండితనం అడ్డై నపుడు
నీ చేతిలో చేయేసి నా ఊసులని బాసలుగా  మలచలేనపుడు

తరాలు దాటినా, అదే పాత్రప్రశ్న మళ్ళీ నాముందుకు వస్తుంది
నిన్నర్థం చేసేసుకున్నానన్న నా గగనగర్వాన్ని నేలకు తెస్తుంది.
నా ప్రశ్న నిజమేనా? నివ్వింకా నాకు అజ్ఞాతవేనా?

***



# దిక్కుమాలిన దిశకెందుకు? డా.నారాయణ గరిమెళ్ళ

**ఒక పక్క,**
ఎవరెస్టు శిఖరాన్ని
అధిరోహించిన మరో భారత నారీ రత్నం
మా మనోఫలకాలమీద
విజయగర్వంతో ఉప్పొంగిపోతోంది.

మరో వంక,
ఐయేఎస్ లో అగ్రభాగాన
నిలిచిన దివ్య కూడా
ఆడోళ్ళంటే ఎవరికి వారే తట్టుకుని
ఎదుగుతోన్న భుజాలు అని సందేశమిస్తోంది

పోటా పోటీలుగా
అవని నుంచి
అంతరిక్షం వరకూ
అడుగులు అడుగులై
అవధరిస్తోన్న
అమ్మల రూపాలన్నీకూడా
కొత్త శకాల్ని నమోదు చేస్తున్నాయని,
దూసుకుపోతున్నాయని
తీర్మానించేసుకుంటున్నప్పుడు

ఇదేమిటిలా..?
ఆడపిల్లని కనబోతోందని తెలిసి
ఆలి మీద అదొక నేరంలా మోపి
మరీ అంతం చేసేశావు.!

అమ్మనేది ఉన్నందుకే
కదా అందరమూ ఉన్నది

నీ ప్రకారమే
జనన ఫలితాలని
శాసించేది అమ్మ మాత్రమే ఐతే
నిన్ను మగాడిగా కన్నందుకు
ఇప్పుడు
నీ తల్లి నిన్ను హత్య చెయ్యాలా,
లేక ఆత్మ-హత్య చేసుకోవాలా?

మరో సారి
మధ్య యుగాల కిందకు
తీసుకు పోతావేమోనని
పాలు తాగుతున్న
పసిపాపలు సైతం
తుళ్ళి తుళ్ళి పడుతున్నారు

నడపడం నడవడం
చేతకాకపోతే
ఆగిపో కానీ
అడ్డుతగలబోకు

హారతులందుకునే వేళ
అతివల కళ్ళల్లో మంటలకు
ఆహుతి కావాలనుకోకు ***

# మాయా? భ్రమా?

భువనచంద్ర

**నేను గుర్తించే ఓ  శరీరం**
భువినుండి దివికి తరలిపోయింది
నన్ను గుర్తించే ఒక ఆత్మ
శరీరంలేని నీడలా లోకంలో మిగిలే ఉంది!
శరీరానిదేముంది!?
అది పుడుతుంది..నశిస్తుంది.
అది నవ్వుతుంది..ఏడుస్తుంది..
అది ఆలోచిస్తుంది..అవలోకిస్తుంది..
కానీ అది అశాశ్వతం..
కానీ శాశ్వతమైన దేమిటో
అశాశ్వతమైన శరీరాన్ని ధరించిన వారికెలా తెలుస్తుంది?
అందుకే ఒక రాజీ కొస్తా..!
తెలిసింది..తెలియదని..
తెలియరాని దాన్ని..తెలుసుకోలేమనీ!
ఏదయితేనేం?
నీడకి ఆధారం శరీరం
కానీ శరీరం నీడకాదు..
మనసుకీ ఆత్మకీ గృహం శరీరం!
కానీ ఆత్మ శరీరం కాదు!
వేదాలు చెబుతాయి
ఉపనిషత్తులు ఘోషిస్తాయి..
ప్రతిమతం..తన వాదాన్ని నమ్మకాన్నీ వినిపిస్తుంది.
కానీ నేస్తం..
మృత్యువు ఏ మతం మాట వింటుంది?
బ్రతుకు ఏ నమ్మకాన్ని బట్టి నడుస్తుంది?

పుట్టుకా.. మరణమూ..
బొమ్మా బొరుసూలా
పక్కపక్కనే ఉన్నా
ఒకరిముఖం మరికటి చూసుకోదు!
'పంచదార పాలు లా ఆ రెండూ కలిసే ఉంటాయి..' అని
తెలిసినా
పిచ్చిమనసు విడదీస్తూనే ఉంటుంది!
మనసు సంగతా?
అది భ్రమని కల్పిస్తుంది..
భ్రమలో బ్రతికిస్తుంది..
భ్రమలాంటి మరణాన్ని వెదుక్కుని
భ్రమలో కలిసిపోతుంది..!
ఆ క్షణంలో
నిజమేమిటి?
అబద్ధమేమిటి.. ?
ఆది ఏమిటి?
అనంతమేమిటీ?
గుడ్డివాడు చీకట్లో వెదికే 'ఓ గుండుసూది' లాంటిది జీవితం
అది దొరుకుతుందా?
మనసుకి వేసిన తెరల్ని విప్పుతుందా?
'నాదీ - నేనూ - అంటూ బ్రతికే ఓ మనిషీ
'నీది ' అనేది అసలుందా?
లేని దానికోసం వెంపర్లాటలెందుకూ?
మాయో, భ్రమో..ఉన్నదానిలోనే
సహజీవనం సాగిస్తే పోలా..!

***

# ఆహ్వానం

అత్తలూరి విజయలక్ష్మి

**నిన్నటి నేడులో నాకీ ప్రపంచం తమాషాగా కనిపిస్తోంది**
చూస్తూ చూస్తుండగానే విశాలమైన ప్రపంచం కుంచించుకుపోయింది
పచ్చని చెట్లన్నీ పత్రహరితం కోల్పోయి మసకబారాయి
మేఘాలన్నీ పొడిబారి బూడిద రాలుస్తున్నాయి
మంచిమనసులు చిరునామాలేక అనాధలైనాయి
మనిషి ఉనికి మచ్చుక్కూడా దొరకడంలేదు
యువత గమ్యం కోసం అన్వేషిస్తూ అగమ్యంగా తిరుగుతోంది
నీతి బురదగుంటలో జారిపడి ఆసరాకోసం అలమటిస్తోంది
ధర్మం కాళ్ళు విరిగి కుంటిదైంది
న్యాయం గాంధారిపై జాలిపడి తోడుగా వెళ్ళింది
హింస విశృంఖలంగా విహరిస్తోంది
కామం ఒంటినిండా రోమాలతో జుగుప్సగా కనిపిస్తోంది
ఏంటి! ఋతువులన్నీ ఇలా రగులుకుంటున్నాయి!
భగ, భగ మండుతూ సంస్కారాన్ని, సంస్కృతినీ ఆజ్యంలా
మమతలనూ, మమకారాలనూ చితుకుల్లా పేర్చుకుంటూ
ఈ ప్రపంచాన్ని గుళికలా చేసుకుని మింగేస్తున్నాయి....
అయ్యో మానవత్వమా నువ్వెక్కడ?
అంతరించిపోతున్న ప్రపంచంలో నీ ఉనికి ఎక్కడ?
అదిగో మురుగుకాలవలో ఈగవై, గజ్జి కుక్క ఒంటిమీద పురుగువై
దుర్గంధభూయిష్టమై పరిభ్రమిస్తున్నావు...ఆదరించే తోడులేక అలమటిస్తున్నావు.
ఫర్వాలేదు... ఆత్మాహుతితో పునీతవుకా.....
నీతినీ, ధర్మాన్నీ ఒంటికి చుట్టుకుని ఆడమ్ గా మళ్ళీ అవతరించు
ఈవ్ సంపర్కంతో భూత, భవిష్యత్,వర్తమానాలను పునః స్రష్టించు....
పూర్ణ కలశంతో ఆహ్వానించడానికి నేనున్నాగా
నన్ను నమ్ము.... !!!!

****



# మురళి వారణాసి నాగలక్ష్మి

**వెదురు బొంగుని వేణువుగా ఊదుతూ**
పొలాల కావల బీడంతా తిరుగుతాడు
పసుల కాసే పసివాడు..
పెద్దల సేవా పిల్లల ఆలనా
పెద్దింటి కోడలిగా పనుల్లో సతమతమై
మనసూ తనువూ అలసిన వేళ..
అనుకోకుండా వినిపిస్తుంది వాడి మురళి
చల్లని పిల్ల గాలిలా వచ్చి నన్ను చుట్టేసి కట్టేస్తుంది!
మబ్బు పట్టిన మధ్యాన్నం ఒకలా
గుబులు పుట్టే శిశిర సంధ్యలో ఇంకోలా
చిక్కని మౌనం కప్పిన చీకటిలో మరోలా..
వెన్నెల్లోనూ, కొమ్మల నీడల్లోనూ
విరిసే పూలమీదా,తడిసిన ఆకుల మీదా ....
అంతటా పాట వ్యాపిస్తుంది!
పాపాయికి పాల బువ్వా , బుజ్జాయికి గోరుముద్దా
తినిపించి, జోకొట్టి నిదురపుచ్చి,
పతి పరిష్వంగంలో పవళించే వేళ
ఆ పాట అలలు అలలుగా తేలి వస్తుంది.!
వచ్చీ రాని వాడి పాట..
గాలివాటున వొచ్చేసి
నా గుండెలో గూడు కట్టేస్తుంది..
వాడి అవ్యక్త భావాలెన్నిటినో
నా మస్తిష్కంలో పేరుస్తుంది..
ఆ పాటలోని తడి నా కంటిలోకి జారి
కన్నీరై పోతుంది!
ఎవరింటి పసి వాడో.. ఎవరింట పనివాడో ..
పిడికెడన్నమైనా తిన్నాడో.. పస్తున్నాడో..
అమ్మ గోరుముద్దల రుచి తెలుసో లేదో ..
పాల బుగ్గల పసితనం కరిగిందో లేదో
ఊరుమాటు మణిగేదాకా గొడ్ల పనీ ఇంటి పనీ కానిచ్చి
దొర కోసం పక్క పరిచి కాళ్ళు పిసుకుతాడు కాబోలు!
లోకమంతా కలల్లో తేలే వేళ
మురళి తీసి మోవికానిస్తాడు!
జాబిల్లి చల్లదనం, వెన్న ముద్ద కమ్మదనం
కన్నయ్య కన్నుల్లో జాలువారే కరుణరసం
రంగరించి రసం తీసి వేణువులో చొప్పిస్తాడు !
వెతలన్ని మరపిస్తూ వెదురునే మురిపిస్తాడు !
తల్లడిల్లే హృదయాలని తల్లిలా ఊరడిస్తాడు..
వేదననే నవ్వించే వేదాంతి తానై
అమ్మలకే జోలపాడి జోకొడతాడు ! ***

# తెలుగు వనిత ద్వాదశి రామలక్ష్మి

**తెలుగు వనిత – సుగుణ భరిత**
నూతన చరిత – శౌర్యపు గరిత
కవుల వినుత – నిగమ భూషిత
భావాల కవిత – రాగల ఫలిత
దీనుల పోషిత – తీయని మమత
విద్యల ముదిత – జాతికి సమత
సంగీత ప్రియుత – సాహిత్య కలిత
పురాణ పూజిత – కావ్యాల కీర్తిత
భాగ్యాల రంజిత – అమల పునీత
కోమల లలిత – నాట్యాల నెలత
ఇంటికి దేవత – తానుంటే మాజత
లేదిక ఏ వెత – రాదిక కలత!!

****

# అద్దంలో దాగిన నేను

మాధవ తురుమెళ్ళ

**అద్దంలో**
**నన్ను నేను చూసుకోవడానికి**
పుట్టుకతోటే అలవాటుపడిపోయాను..
చిన్నప్పట్నించీ,
అద్దం నన్ను ప్రతిబింబిస్తూ
నన్ను నాకు చూపిస్తూ ప్రపంచాన్ని కప్పేస్తూ వచ్చింది.
అద్దం మెల్లగా -
కర్ణుడి కవచంలాగా -
నా కళ్ళకు డాలుగా మారిపోయింది.
నిరంతరం నన్ను నేను ప్రతిబింబచేసుకుంటూ
నన్ను నేను ప్రేమించుకుంటూ -
నువ్వనే దానివి ఉన్నావనిగానీ,
మూసిన పెదవుల వెనుక శబ్దంచెయ్యని
ఆర్తనాదాలు చేస్తున్నావనిగానీ,
వంటింటికోరల్లో నలిగి మగ్గిపోతున్నావనిగానీ,
ప్రేమకు నోచుకోక దీనంగా
అవనతవదనంతో దారిపక్క నిలుచున్నావనిగానీ,
ఏదోఒక రోజు మారకపోతాడా అని -
మోడువారిన సంసారపు మొక్కకు -
సహనం నీరుపోస్తూ నిరీక్షిస్తున్నావనిగానీ,
గమనించలేకపోయాను...
నీవులేని నాడు
నీ సహాయంపొందని నాడు
నా ప్రతిబింబానికి అర్ధంలేదని
నా అద్దం నాకెప్పుడూ చెప్పలేదు!
నా కళ్ళ ముందు పరుచుకున్న అద్దం నన్నేచూపిస్తూ
ఆకలితీరిన నా బొజ్జని చూపిస్తూ,
నిన్ను చూపించకుండా దాచి
నీచేత
అందంగా తీర్చిన నా ఇల్లుని చూపిస్తూ,
అద్భుతమైన జీతంగా మారిన నా కొలువుని చూపిస్తూ,
అద్దం -
నా జీవితాన్ని చుట్టలా చుట్టుకుని అందమైన అబద్ధంగా
మార్చింది.
పసిపిల్లలకి అద్దంచూపించకు ఎత్తుపళ్ళు వస్తాయంటూ అంటే
మూఢనమ్మకమేమో అని భావించిన నేను
పెరుగుతూ పెరుగుతూ
నా చుట్టూ ఎత్తుగా కట్టుకున్న అద్దపుగోడను
చూడలేకపోయాను,
నీవనేదాన్ని
అద్దానికి ఆవల ఉంచానని
గమనించలేకపోయాను.
క్రమక్రమంగా
నీవు నాపై చూపించిన ప్రేమతోనో
నీ చక్కటి మాలిమితోనో
నీవు కురిపించిన దయార్ద్ర వర్షంతోనో
నీవు పెట్టిన అన్నంతోనో
నీవు పంచి ఇచ్చిన ప్రణయంతోనో
దేనికో చలించిననేను
నీకు బహుమతి ఇవ్వాలనుకుంటూ,
నా మనసనే పూలసజ్జను అందమైన
ప్రేమపూలతో నింపాలనుకుంటూ
చేసే ప్రయత్నంలో
అనుకోకుండా -

అప్పటిదాకా
నా గుండెలో నిండిన బండరాళ్ళను
రివ్వున బయటకు విసిరేసాను
అప్పుడే -
నిన్ను నాకు నిజంగా బహుమతిగా ఇచ్చిన
భగవంతుని దయతో
నా అద్దం, నా జీవితపు అబద్ధం ---
భళ్ళుమని బద్దలైంది...
ఆ రోజు ---
అనేకానేకాలుగా ఛిద్రమైన నా రూపం
పోల్చుకోలేనంత పగిలిపోయింది
నీవే నేనుగా మారిపోయింది
అందాన్నే ప్రతిబింబింపచేయ ప్రారంభించింది.
ఈవేళ -
నా కళ్ళ ముందు నన్ను చూపించే అద్దం లేదు,
నీకూ నాకూ ఎలాంటి అడ్డూ లేదు,
నిన్ను పలకరించాలన్న నా తహ తహలో వ్యాపారంలేదు,
నీ చేతిని పట్టుకున్న నా చేతలో స్వార్థంలేదు,
నిన్నుచూసి ప్రేమగా నవ్విన నా కళ్ళ లో వ్యభిచారంలేదు.
ప్రియతమా -
నా అద్దం బద్దలై నేను
సిద్ధుడిలా మారాను
సిద్దార్దుడిలా నవ్వాను
ఆనందతాండవం ఆడేందుకు సిద్ధమైన శివునిలా
ఇప్పుడిలా నీ ముందు నిలుచున్నాను....
నీ ప్రేమలో నా జీవితానికి ఆనందగీతం
నిన్ను నాకిచ్చిన భగవంతునికై ధన్యవాదగీతం పాడుతున్నాను. ***



# నన్ను క్షమించు

## మనస్విని

**అమ్మా! ఎలాగున్నావమ్మా ?**
నీకు ఏమైందమ్మా?
నీవు లేకపోతే నేనెలా బతికేది?
నా ఉనికేది? నాకు భయమేస్తోంది-
నీవు అంతరించి పోతున్నావంటున్నారు
కాలంలో కరిగిపోతున్నావంటున్నారు
నీ బిడ్డలు నిన్ను వదిలేస్తున్నారంటున్నారు
నీవు దిక్కులేని దానివైపోతున్నావంటున్నారు-
నీ రొమ్ము పాలు తాగి, నిన్ను కాలితో తంతున్నారు
నీ స్థితి చూసి, నిన్ను బాగు చేయ్యాలంటున్నారు
కొత్త పోకడలతో నీ రూపు మారిందంటున్నారు
పాత రూపులో నువ్వు పనికిరావంటున్నారు -
నీ ఒడిలో పెరిగిన వారిని ఒకటిగా చేస్తే
ఉండలేక తన్నుకు ఛస్తునారు
పోనీ విడిపోయి నీ సేవ చేస్తారంటే
ఇంకొందరు కుదరదు అంటున్నారు-
నీ అక్కా చెల్లెళ్ళు సుఖంగా ఉన్నారు
వాళ్ళ బిడ్డలు తగవులాడుకున్నా
అమ్మ పేరు చెబితే దూయాదులు కూడా
అంతా ఒకటవుతున్నారు -
నీ ఇల్లు వదిలి దూరం పోయి
నిన్ను మరిచిపోలేక తపించేవారున్నారు
వారి చేతనైన రీతిలో
నీ సేవ చెయ్యాలని తపనపడిపోతున్నారు -
అక్కడ కూడా తయారయ్యారు
నీ పేరు చెప్పి దోచుకునేవారు
నీ సేవ అని చెప్పి దగా చేసేవారు
చివరాఖరికి వారు చెయ్యరు, వేరొకరిని చేయ్యనివ్వరు -
నీ సేవ అని చెప్పడం
ఒక మోజైపోయింది
పేరు చేసుకుని, పబ్బం గడుపుకుని
నీకు మొండిచెయ్యి చూపిస్తున్నారు -
ఇంత నీ గురించి మాట్లాడేవారికి
వాళ్ళింట్లో కూడా నువ్వు ఒక అతిథివే
వాళ్ళ పోకడలు చూసి మోసపోవద్దు
బయటివాళ్ళు వచ్చినప్పుడే నీ మీద ప్రేమ -
వాళ్ళ పిల్లలకు సైతం నీ ఆద్యంతాలు తెలియవు
హంగుల కోసం ముద్దుముద్దు మాటల నేరుస్తారు
తడి గుడ్డతో నీ గొంతు కోస్తారు
వేరే అమ్మలతోనే నిత్యం వాళ్ళ తైతక్కలు -
నిన్ను వివస్త్రను చేసి బజారుకీడ్చే
కీచకులు నీ బిడ్డల్లోనే వున్నారు
ఊసరవెల్లిలా రంగులు మార్చే వేషగాళ్ళున్నారు
వాళ్ళ కపట ప్రేమకి మోసపోవద్దు -
ఇంతా తెలిసి నేను అశక్తుడను
కొత్త మందు వేస్తానంటే నీకేం తెలుసంటారు
పాత వైద్యం తమకు తెలియదంటారు
ఇంతా తెలిసి నేను వివశుడను -
ఏమీ చెయ్యలేని నా దుస్థితికి
నన్ను క్షమించు -
ఓ తెలుగు భాషామతల్లీ
నన్ను క్షమించు

***

# టెక్నిక్కు

## ఎస్.ఆర్.బందా

**పొగిలి పొగిలి నవ్వీ**

పడీ పడీ యేడ్చేక

పీల్చీ పీల్చీ తాగేసిన తర్వాత

ఆరారా ఔపోసన పట్టేక...

ఎన్నో రంగుల జీవితం కొన్ని కుంచెల విదిలింపులు

చాలా గుటకల మధ్యన కొద్ది అనుమానాల త్రేనుపులు

సర్వం నన్ను త్యజించి సర్వం నేను త్యజించి

మరోసారి అందుకుని మనసారా జ్వలించి

జపించి తపించి స్ఖలించి వర్షించి

బాష్ప బిందురూపం ధరించి

...

ప్రపంచాగ్ని తాకనిదే ఆరదు

మనోవ్రణం సెగ రేగనిదే ఆగదు..

ఉపసంహారం -

నుదుటిమీద పడే జుట్టూ వొంటరితనంలో వొదిలిన బెట్టూ

మూర్ఛనల చాటున మౌస్ ప్రకంపనం...

****



# శూన్యం
ప్రతాప వెంకట సుబ్బారాయుడు

కాలం గాయం మాన్పేలోపు
మళ్ళీ రేగుతోంది
రేపటి మీది ఆశని
ఎండమావి చేస్తోంది
మైళ్ళకొద్దీ అడుగులు పడుతున్నాయి గాని
గమ్యం కనిపించడం లేదు.
చెట్టు..పుట్ట..పిట్టలతో
సావాసం నామోషిప్పుడు..
యంత్రాలతో దోస్తీ..
కాళ్ళతో కాదు చేతివేళ్ళతో
ప్రపంచయాత్ర..
తరాల మధ్య తేడాలు
తుడిచిపెట్టుకు పోయాయి
డబ్బుది మాత్రమే విశ్వరూపం
దాని ముందు అందరి సాష్టాంగ నమస్కారం!
అనుభూతులు లేని
కాగితప్పూ బ్రతుకులు
వెలుగూ చీకటీ ఒక్కటే అయినప్పుడు
బ్రతుకు శూన్యమే కదా?
****

# ఇది ప్రగతి
ఉమాదేవి పోచంపల్లి

నేడు నీ ఆలోచనలే
రేపటి నీ నిజాలు
నేటి నీ అభిప్రాయాలే
రేపటి నీ ఆచరణలు

నేటి ఈ అంధకారం పట్ల
నీ నైరాశ్యం , నిస్పృహ
రేపటి జాగృతికి ఆనకట్ట
నేటి నీ ప్రగతి
రేపటి నీ ఉన్నతి

కొన్ని అడ్డుగోడలు
కొంత అలజడి
కొన్ని మార్పులు చేర్పులు
కొంత మరపులు చెరుపులు
క్రొత్త జగం క్రొత్త యుగం
****



# వైతాళికునివై జీవించు    అలజంగి ఉదయ్ కుమార్

**చేవలేనివాళ్ళు - చేతకానివాళ్ళు**
ఓర్వలేనివాళ్ళు - ఓరిమి లేనివాళ్ళు
చేయలేనివాళ్ళు - చూడలేనివాళ్ళు
సత్తాలేనివాళ్ళు - చచ్చుబడినవాళ్ళు
గతం అతుకుల బొంతలో
పొద్దెక్కినా గూడా ముసుగుతీయనోళ్ళు
మెచ్చలేనివాళ్ళు - ముచ్చుముఖంగాళ్ళు
చిదిగిన స్వీయ ఢంకాలను
చిరకాలం బాదుకొనేవాళ్ళు
తమ ఎత్తులు తామే
నిత్యం కొలుచుకునేవాళ్ళు
అత్తెసరు బతుకుల్ని
మరగుజ్జుల గుంపులో
మూతులు నాకుతూ మురిసేవాళ్ళు
ప్రజ్వరిల్లే ప్రతిభా కాంతుల్ని
కళ్ళుండీ కానలేనివాళ్ళు
పీత బతుకుగాళ్ళు
ఎవరూ వీళ్ళంతా వీరితో నాకెందుకీ తంటా అనబోకు
ఊరికే స్పందించి అదేపనిగా గుండెలు బాదుకోకు
నీవెదుగుతున్నావనేందుకు వీళ్ళే కదా సాక్ష్యం
విజయానికి చేరువవుతున్నావనేందుకు వీరే సంకేతం
మనసారా క్షమిస్తూ.... జాలి కాస్త కురిపిస్తూ
తోక కాస్త జాడిస్తే.. జూలు కాస్త విదిలిస్తూ
నీవెరిగిన గమ్యం ...వైపు,
నవ కవనాలను సాగించు
జయకేతనాలను ఎగిరించు
వైతాళికునివై జీవించు ***



# నిరీక్షణ

జ్యోతిర్మయి

**ఈ రేయి ఎన్నటికి తరిగేనో...**

నా ఉద్వేగం చూసి
క్షణాలన్నీ చుట్టూ చేరి ఆటపట్టిస్తున్నాయి !
చీకటి చిక్కనై చిందులు వేస్తోంది!
వెన్నల చిన్నబోయి
మబ్బుల మాటున మొహం చాటేసింది!
విరిసిన మల్లెలు
గుసగుసలు పోతున్నాయి !
నిశీధి అంచుల్లోకి
నిశ్శబ్దం మెల్లగా జారిపోతోంది!!
వెలుగు రేఖ ఒక్కటి
అలవోకగా తొంగి చూసింది...
నిదురించిన తోట
బద్దకంగా ఒళ్ళు విరుచుకుంది!
ఏమయిందో ఏమో
చుక్కలు మెల్లగా తప్పుకున్నాయి !
రేతిరి తన రాజ్యాన్ని వదిలి...
తెలియని తీరాలకు తరిలి పోయింది!
ఎదురు చూసిన యెదలో
సందడి మొదలైయ్యింది...
తూరుపు దిక్కున
సన్నాహాల కోలాహలం!
వాకిట వేచిన నెచ్చెలి కోసం
వెలుతురు బాటలో సూరీడు!! ***



# వీడుకోలు వేమూరి విజయలక్ష్మి

**అంతా బాగానే ఉంది కదా**

అందరం తృప్తిగా ఉన్నాము కదా

ఎవరి మనసులు బాధ పడలేదు కదా

ఎవరూ ఎవరినీ నొప్పించలేదు కదా

నవ్వుకుంటూ గడుపుదాం మిగిలిన నాలుగు రోజుల్నీ

ఆ నవ్వులతో కప్పుదాం గాయపడిన మనసు పొరలను

సరదాగా మాట్లేడేస్తూ నవనీతం రాద్దాం ఆ పిచ్చి మనసుకు

మళ్ళా సలహాలు చెప్పేద్దాం

మళ్ళా సలహాలు వినేద్దాం

మరింక ప్రశ్నలు వద్దు

మరి జవాబులు అడగవద్దు

ఉదారంగా ప్రవర్తిద్దాం

ఉదాసీనంగా ఉండద్దు

మూగబోయిన గొంతును మళ్ళీ విప్పి

గట్టిగా ధైర్యంగా మాట్లేద్దాం

మళ్ళా రావాలి సుమా

మళ్ళా వెళ్ళాలి సుమా

అని గుర్తు చేస్తూ, గుర్తు చేసుకుంటూ

జరగాల్సిన పనులను జరిపేస్తూ, ముడుచుకుపోయిన

ఆ ముఖాలకు ఆప్యాయత అనీ ముసుగును మళ్ళీ కప్పుతూ కనిపిస్తూ

విడిపోదాం

వీడుకోలు మాటల్ని వల్లె వేద్దాం

రండి తప్పకుండా

వస్తాం తప్పకుండా

ఇంక సెలవు

పొంగుతున్న దుఃఖాన్నిఅదిమిపెడుతూ

కంట్లో నీళ్ళను తుడుచుకుంటూ

చెప్పేద్దాం - టా టా బై బై లు. ***



# భగ్నప్రేమ

## బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్

**చైత్రమాసపు కోయిలనై చివురించిన తలపులన్నీ ఎలుగెత్తి పాడాను**
వైశాఖ గాడ్పులలో వలపు చలివేంద్రమంటి నీ చిరునామా వెదికాను
జగతిలో శ్రేష్ఠమైనవన్నీ జ్యేష్ఠలో పదిలపరచాను
ఆషాఢమేఘాల అనురాగపరిష్వంగంలో
నీ అందెల నిక్వాణం విని నిదురమరచాను
భారమైన హృదయం ఆవిరైన ఆర్ణవమైతే
కురిసిన శ్రావణ భాద్రపద కుంభవృష్టి ధారలలో
తడిసీ,వణికీ తనువంతా నీరైపోయాను
ఆశ్వయుజమంతా ఆశలపందిళ్ళు పరిచి
ఆవిష్కృత  శరద్వెన్నెలలో నీమోము గాంచి
అవ్యక్తానుభూతుల సుడిలో అవశేషమునై నిలిచాను
కార్తీకమంతా కలతల కడగండ్లు రేగి
కాటుక శర్వరిలా కమ్ముకొని భయపెడితే
వెచ్చని నీ ఊసులదీపాలు వెలిగించి ఉపశమనం పొందాను
నీ వియద్వేణియ నుండి విరివిగా రాలిన నీటిబిందువులు
మార్గశీర్షపు తొలిసంధ్యలలో మంచుముత్యాలై మెరిసిపోతే
మత్తెక్కిన మధుపమునై తిరిగి మధురోహలు గ్రోలాను
పుష్యమాసపు ప్రవాసినై
ప్రేమంతా పోగుచేసి పుష్పమాలికలల్లి
భవిష్యత్ బహిర్ద్వారం వద్ద బంట్రోతునై నిలబడితే
తిరస్కరించి,తూలనాడి, తిమిరంలోకి నెట్టేశావు
మాఘమాసపు పెళ్ళిపందిరిపై మందస్మితయై అటు నువ్వు
మొదలు తెగిన వృక్షమునై మృత్యువాకిట ఇటునేను
కఠిన కర్కశ పాషాణ నాతివై నువ్వు కాదు పొమ్మన్నా
కడతేరని ప్రేమతో కొత్తఊపిరిలూదుకొంటాను
నీ పెరటి పున్నమితోటలో
ఫల్గుణినై పరిమళిస్తాను ***



# ఏమో..ఏమో..

డా.మూర్తి జొన్నలగెడ్డ

**కొండ బండల చీల్చు పూల గుండెలెంత కఠినమో**
పూల చెండుల దాల్చు రాల గుండెలెంత మధురమో
అలలు అలలుగా ఇలను తాకినా వీడనిదేమి మోహమో
తడవ తడవకూ తడిసి మురిసినా తీరనిదేమి తాపమో
పండుటాకుల రాల్చి మోడువారుటనేమి చిత్రమో
పచ్చ చిగురుల దాల్చి ఫలములిచ్చుటకేమి ఆత్రమో
కనులు కాయగా ఎదురుచూసిన దర్శనమేమి భాగ్యమో
మనసులాగినా తిరిగి చూడని మగువలదేమి చోద్యమో
ఏమో ఏమో ఎన్నటికైనా ఎవరికైనా తెలియునేమో! ***



# మేము మేమే..మాకు మేమే..

విజయ్

**విధాత విసిరేసిన విస్తరాకులో**
వదిలేసిన మెతుకులం కాదు మేము!
పరుగులో నాగరికతతో పోటీ  పడుతూ
అభివృద్ధిలో సంస్కృతితో తలపడతాం
సయ్యో టయ్యో తేల్చుకుంటాం
"మేం మేమే..మాకు మేమే"

సంధ్యావందన సంస్కృతి మరచి
పాచి  ముఖానికి పన్నీరు పూసుకొనే స్థాయికి చేరుకున్నాం
"మేం మేమే...మాకు మేమే"

సంకల్పం చదివే సాంప్రదాయం నించి
సెల్ ఫోన్‌లో చూసుకుంటే గాని
తారీఖు తెలీని ప్రగతి పథంలో అడుగు పెట్టాం

చంద్రమండలాన్ని ఆక్రమించుకొబోతున్నాం
కొన్నల్లాగితే సుర్యుడికైన చుక్కలు చూపించగలం
"మేం మేమే...మాకు మేమే "

మేం దేనికి తక్కువ కాదు
అన్నిటితో ప్రపంచంతో పోటీ పడతాం
హితవాదం, మితవాదం, పిడివాదం
చివరికి ప్రాంతీయ వాదం దేన్నీ వదిలిపెట్టం

మాకు మేమే సాటి
మేమంతా సామాన్యులం కాదు!
మేధావులమనే ముసుగులో
స్వార్ధపు రాక్షసుడు వేసిన
అష్ట గ్రహ భందనలో చిక్కుకుని
మూర్ఖత్వం, మూఢత్వం, నైసర్గిక రేఖలుగా ఏర్పరచుకుని
అభివృద్ధి మేలి ముసుగులో,
అధోగతిలో, పాతాళంలో, చిక్కుకున్న, పాపాత్ములం
మేం మేమే...మాకు మేమే



# ఎడబాటు

## జ్యోతిర్మయి

**ఈ దారిలోనే కదూ నా చిన్నారి**
బుల్లి బుల్లి అడుగులతో పరుగులు తీసింది!
అదిగో ఆ తోటలోనే మునుపెన్నడో
ఊయల ఊగిన సందడి!

బుజ్జి సైకిలును చూసి
మోమున మెరిసిన సంతోషం!
చారడేసి కళ్ళతో బెంగగా
స్కూలుకు వెళ్ళిన వైనం!

శాంతాతో ఫోటోలు, జింజెర్ బ్రెడ్ హౌసులు,
హాలోవీన్ డ్రస్సులు, ఈస్టర్ ఎగ్ హంట్లు,
కోరస్ పాటలు, టెన్నిస్ ఆటలు ....
ఓహ్ ఎన్నెన్నో!!
అవన్నీ నిన్న మొన్నలా లేదూ!

ప్రతి మలుపులో నీ వేలు పట్టుకుని నడిపించాను!
మలుపులన్నీ దాటి చూద్దును కదా...
ఆ చివర... మలుపు తిరుగుతూ.....
ప్రగతి పథంలో నీవు!!

నీ జ్ఞాపకాల బాసటగా
ఈ చివర నేను!!



# ఆ క్షణం

ఎస్.ఆర్.బందా

**ఒక మెరుపు మెరిసి కళ్ళు జిగేల్మన్న క్షణం..**
అహం పొడుచుకొచ్చి అస్థిత్వాన్ని మసకబార్చిన వైనం
అతి పురాతనమైన బహిర్గత రహస్యంలో
అప్పటి తాదాత్మ్యాన్నే దాదాపు అందుకున్న క్షణం
అదే చోట ఆ మూలలోనే మరో వాహిని చుట్టుకుని
మార్గ రహిత ప్రయాణంలో మరో మరీచికని పలవరించిన చిత్రం!
మూతలు తెరుచుకోక, మాటల మూటలు బరువై
చరిత్ర తిరగరాయాలన్న విచిత్ర వేషం వేయబోయి
ఔరా..ఎంత సుఖం అమ్మో..మరెంత దుఃఖం
ప్రభూ..నాకెందుకీ శీతలోష్ణ స్వేదజ్ఞానం!
వున్న బాణాలెందుకిలా ఖర్చవాలి
తగ్గిన ప్రాణాలెన్నాళ్ళిలా కొడి గట్టాలి?
నిషిద్ధ రసాలకి దాసోహమన్న చేతులనే
విముక్త సుమాలుగా మార్చి
అవ్యక్త మనోహర దృశ్యాలని
అంతర్నేత్రాలతో ఆనందించాలి
వెలికురికే వేడి వైరాగ్యాన్ని
అంజలి ఘటించి ఆస్వాదించాలి..



## కృతఘ్నత
### వింజమూరి రాగసుధ

**కరం అందించినా కరవాలం దూసావు**
నవనీతం తినిపించినా నవనాడులూ కృంగదీసావు
జీవాన్ని, జీవనాధారాన్ని నిలిపినా
వెలుగునీడల్లో వెన్నంటి ఉన్నా
వెన్నుపోటు పొడిచావు నిలువుదోపిడీ చేసావు
ఆప్యాయత కరువై పసివాడిలా పరితపిస్తుంటే
ఆత్మీయతని పంచి ఇచ్చి
లాలనల లేపనం పూసిన ధరణి లలామను
గొడ్డలందుకొన్నావు ఘోరంగా గాయపరిచావు
ఆ కత్తివేటు ఈ కృతఘ్నతకాటు
భళిభళిరా మానవా
నీ దౌర్జన్యానికి ఇదే దీటు



## ఇంతేనా..జీవితం
### బుద్ధ వెంకట ప్రతాప్ రెడ్డి

**సముద్రం వడ్డున రాసుకున్న రాతల్లా**
చూసి మురిసిపోయే లోపే ...
ఇంకో అల వచ్చి తన్నుకుపోయినట్టు ...
రోజులు గడిచి పోతున్నాయి ...!!
అలా మిగలదు .....నా శిలా మిగలదు ...!!
మధ్యలో కలలొకటి ...
వెన్నెల్లా పరుచుకొని కవ్విస్తాయి ...!!
ఆ వెన్నెలా వుండిపోదు ....
నా కన్నులూ నిండి పోవు ...
ఎప్పుడూ వెలితిగానే వుంటుంది .. !!
చిల్లు పడిన బిందెలా ...
ఈ జీవితం ఎంతకీ నిండదు ... !!
చేతిని అడ్డుపెట్టి ఆపాలని చూస్తాను...!!
అలసట ఎక్కువై ..
ప్రాణాలు అదుపు తప్పుతాయే గానీ...
ఎన్ని తీరాలకు చేరినా
ఈ ఆరాటం తీరదు..!!
జీవితమంతా ఇదే పోరాటం
అని తెలిసే రోజున...
నాకు శక్తి వుంటే బాగుండు...!!
కొంచెం దీని గమన్నాన్ని మార్చి చూస్తాను..!!



# జ్ఞాపకాలు

## శ్రీమతి రత్నమాంబ చీర్ల

**గోదావరి సైకత శ్రేణులలో కట్టుకున్న పిచ్చుక గూళ్ళు**
అలల తాకిడికి కొట్టుకుపోతే నా కళ్ళనిండా కన్నీళ్ళు
నిల్చుని చూస్తున్న బిత్తర చూపులు
అమ్మ అక్కున చేర్చుకున్న అనుభూతి వాసనలు
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు !

బొమ్మల పెళ్ళిళ్ళతో, పెళ్ళి సందళ్ళతో ఆదివారాలు
గుజ్జనగూళ్ళలో వండి వడ్డించిన విందు భోజనాలు
ఉడికీ ఉడకని పప్పు, వేగీ వేగని కూరలు
చిమిడిపోయిన అన్నాలే అమ్మ వంటని మించిన అమృతాలు
రాత్రంతా అమ్మమ్మని విసిగించే కడుపునొప్పులు
శొంఠి ఉక్కిరి తింటే గానీ తీరని బాధలు
స్మృతి పథంలో మధురభావనలు!
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు !

చదువులూ, ఉద్యోగాలూ, పెళ్ళీ , పిల్లలూ
వారి ఆటలూ, కేరింతలూ, వేధింపులూ, ఊరడింపులూ
వీరీ వీరీ గుమ్మళ్ళు, గప్‌చుప్పుయ్యిన దొంగలు
గోరింటాకులు పెట్టి ఊగించిన తద్ది ఊయలలు!
ఉద్యోగంలోని అలుపులు తీర్చిన పిల్లల చదువు సంధ్యలు
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు !

పదవీ విరమణ, వృద్ధాప్యం,
ఇంత చిన్నదా జీవితం!
తిరిగే చక్రం లాంటిదీ కాలం
చరిత్ర పునరావృతం!

పొట్టచేతపట్టుకు పల్లెలొదిలి పట్టణాలకొస్తే మా తరం,
పట్టా చేతికి రాగానే దేశం వదిలింది మా పిల్లల తరం!
పట్టి లాక్కొచ్చింది మమ్మల్ని పేగుబంధం
కట్టి పడేసింది ఓపికలేని ముసలితనం!

శాండ్ బాక్సుల్లో పిచిక గూళ్ళు కడుతున్న
మనవల ఆటల్లో
నాటి గోదారి ఊసుల్ని గుర్తు చేసుకుంటున్నా!
బార్బీల కిచెన్‌లో పార్టీలు చేస్తున్న
మనవరాళ్ళ వంటల్లో
నా గుజ్జనగూళ్ళ రుచులు చూస్తున్నా!

స్విమ్మింగ్ పూల్‌లో పిల్లల కేరింతల్లో
రమ్మని పిలుస్తున్నాయి మా ఊరి చెరువు చేపలు!
థామస్ ట్రెయిను ప్రయాణంలో
తలపుకొచ్చిన పల్లకీ ఊరేగింపులు!
కొబ్బరి బూరల్లా వినిపిస్తున్న రికార్డర్ శబ్దాలు!
లెగో విమానాల రెక్కల మీద
ఎగిరి వస్తున్న లెక్కలేనన్ని జ్ఞాపకాలు
ఎన్నెన్నో మధురమైన నా బాల్య స్మృతులు!
కాలమనే మట్టిలో కప్పేసిన గతం గురుతులు!
మనసు పొరల్లో కురిసిన తలపుల వానలు!
వానకు తడిసిన మట్టి వాసనలు!
ఆ వాసనతో మళ్ళీ ఊపిరి పోసుకున్న నా తలపులు
అందుకేనేమో...
కొత్తగా నిన్ననే పుట్టినట్టు.....
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు!

***

# రైతు హాలిడే

డా.రమణ యశస్వి

**పొలంతో వేసవి ఎడబాటు కాలాన్ని**
ఆశల కొడవళ్ళతో కోసేసి,
ఋతు రాగాలను ఆలపిస్తూ
బీడు భూమిలో
నెర్రె లిచ్చిన నేలపై పడుకొని,
వేల కళ్ళ ఆకాశంవైపు వేయి కళ్ళతో
ఎదురు చూస్తున్న కర్షక జీవికి -
మేఘాలు వురితాళ్ళను పేనుతున్న శబ్దం
ఉరుములై గర్జిస్తుంటే ,
అన్నదాత కనురెప్పలు ప్రమాద సూచికలై
రెప రెప లాడుతో
వర్షిస్తున్న కళ్ళను ఓదారుస్తున్న దృశ్యం
మెరుపులా ఆవిష్కరించబడుతోంది!
గగన కాన్వాసుపై రాలిన చినుకు
మరుజన్మ రైతన్న కంటిలో అన్నట్లు
జలజల రాలిన కన్నీరు
ఎడమ భుజంపై కండువాని తడిపేసి
ఈ కాసేపన్నా చల్లంగుండు బాబాయి
అని దీవించినట్లుంది!
కండువా కుడి భుజంపైకి మార్చుకొని
తడబడుతున్న అడుగులతో
తను బలం పెట్టి పోషించిన నేలతల్లిని తాకి
'ఋణం తీర్చుకోలేనమ్మా '
అంటూ ఇంటి ముఖం పట్టాడు !

కడుపులో ఎలుకలు పరుగిడుతుంటే
తను నడుస్తున్నాడు !
ఏసీ రూముల్లో వారి బొజ్జలు నింపిన తన రెక్కలని
ఎండిన డొక్కలు వెక్కిరిస్తుండగా
అమ్మాయి పెళ్ళి, అబ్బాయి చదువు , అప్పులు
నకిలీ విత్తనాలు, కరెంటు కోత, ఎండిన కాలవ
గుర్తొస్తుండగా
నడుస్తూనే వున్నాడు!
పంట విరామం అని తెల్సుకొని విస్తుపోయి
పురుగు మందు కొట్టిన చేతులతో
పుడమి తల్లి చేదు మందు తను తాగేసాడు!
అది నకిలీదని, ప్రాణం పోదని తెల్సుకొని
తడిసిన కండువా మెడలో బిగించి
పశువుల కొట్టంలో
రాజకీయ బలిపశువు అయ్యాడు !
క్రాప్ హాలిడే కాదు హాఫ్ హాలిడే కాదు
ఫుల్ శలవు ప్రకటించాడు
వికటించిన బ్రతుకు బండి ఈడ్చలేక
మరో కష్టజీవి మరో బడుగు
మరో ప్రపంచంలోకి తడిసిన కండువాతో !! ***



# అందమైన ప్రశ్న
## శుభ

**అధరాలలో మధువును నింపుకున్న**
పూల కన్నెలను అడుగు
కొంటె తుమ్మెద ఏమని పలుకరిస్తోందో.,
కదిలే అలలను అడుగు
గాలికి ఏ వలపుల వలలను వేస్తున్నాయో.,
కొమ్మ కొమ్మను పెనవేసిన తీగెలను అడుగు
కౌగిలింతలోని గిలిగింత ఏమిటో.,
పిల్ల తెమ్మెరలను అడుగు
వేణువులోని తీయని రాగం ఎక్కడిదో.,
నా కనుల కొలనులోని దాగిన
నీ జ్ఞాపకాలని అడుగు
నా మనసుకు ఈ పరవశం ఎందుకో !!!

***



# విలోమగమనం
## రావెల పురుషోత్తమ రావు

**అలా వెనక్కు నడుచుకుంటూ**
తిరిగిచూడకుండా వెళ్ళిపోతే
వృద్ధాప్యం కేరింతలుకొడుతూ
యవ్వన రూపురేఖలుదాల్చి
చెంగు చెంగున దుముకుతూ
సొగసుల సోయగాలతో
ముందుకు గెంతుతుంది!
యవ్వనం మాత్రం ససేమిరా
బాల్యం వైపుకు అడుగులువేసే ప్రసక్తేలేదని
మొండికేస్తున్నది!
ప్రణయ ద్వారాలు మూసుకుపోతుంటే
ససేమిరా ఒప్పుకోనని మొరాయించడం
మొదలెడుతుంది!
బాల్యం మాత్రం అనూహ్యంగా
శైశవం వైపు బిరాన పరుగెడతానని
ఉత్సాహంతో ఉరకలు వేస్తూ
ఉవ్విళ్ళూరడడం మొదలెడుతుంది!
మాతృస్తన్య మాధుర్యాన్ని
మరోమారు తనివితీరా గ్రోలవచ్చునని
అణువణువునా క్షణాలకోసం ఆశగా
ఎదురుచూస్తుంది!
తిరోగమనంలో యింత తీయదనం వుంటుందా అని
ఆశ్చర్యపోవడం అందరివంతవుతుంది.

***

# కొంతమంది ఎన్నారైలు డా.మూర్తి జొన్నలగెడ్డ

**ఊరుకాని ఊరులోన**
అపరిచితుల సేవలోన
 మునిగి తేలు తెలుగు సేన
సూటేసెను బూటేసెను
చిరునవ్వుల ముసుగేసెను
తియ్య మాటల తేనె పూసెను
రెక్కాడగ డొక్కాడెను
యంత్రములా పనిచేసెను
లోకమ్ లే లోకమాయెను
జీతములే జీవితమాయెను
సొమ్మెంతయొ వెనకేసెను
సొంతూరుకి పంపేసెను
షేరులెన్నొ కొనివేసెను
ఇళ్ళన్నీ తనవేను
అద్దెలన్ని జమచేసెను
స్నేహాలను సరితూచెను
బంధుత్వము మరి మరచెను
పిల్లలు మరి పెరిగేను
ప్రైవేటు స్కూలాయెను
తేటతెనుగు చేదాయెను
మెడిసిన్లో సీటంటెను
అందరికీ రాకుండెను
తనదేశము పంపించెను
డొనేషన్లు చదివించెను
పెళ్ళీడు రానె వచ్చెను
కుర్రాడు బానె నచ్చెను
హోదాలను సరిపోల్చెను
కట్న కానుకలు తెగ రాల్చెను
కొడుకేమొ అందొచ్చెను
కూతురెళ్ళి కోడలొచ్చెను
బాబ్డ్ హెయిరు కోడళ్ళు
అత్తగారి ఆరళ్ళు
చిన్న వంక మరి చాలు
వేరు వేరు కాపురాలు
తల నెరిసెను
పను కదిలెను
తన వారలు దరిలేరను
తన ఊరిని వదిలేనను
బెంగ మరీ పెరిగేను
నిద్రసలే కరువాయెను
ఒక రాత్రి కలలోను
ఆ రాముడు అనియేను
ఇన్నాళ్ళుగ ఇన్నేళ్ళుగ
నీ లోను నీవేను
ఇకనైనా ఇపుడైనా
నా మాటను విను విను
పంచుకుంటే పెరిగేను
సుఖాలన్ని అందరితోను
పంచుకుంటె తరిగేను
కష్టాల బరువేను
నలుగురితో కలిస్తేను
అందరికీ పండగేను
ఊరంతా సందడేను

***

# వ్యత్యాసం

ఉమాదేవి పోచంపల్లి

**భగభగమండె గ్రీష్మంలో,**
వడగాడ్పుల తాకిడిలో,
బీటలు బారుతున్న
భూమినుండి వీస్తున్న
వీచికలో వడలిపోతున్న నాకు,
ఊహల చిరుగాలి స్పర్శలో
వర్షాకాలంలో విరిసే
తెల్లనికలువల మెల్లని
సుగంధం కనుగొనాలని -
నీలాకాశంలో మేఘాలపైన
పాలసముద్రంలో
పయనించే నౌకలా,
కాలంతో బాటుగా
యానంచేస్తున్న
ప్రభాతకిరణాలలో,
విహంగాలతో వెళ్ళే
విమానంలోంచి,
మంచులో తడిసిన
ప్రపంచాన్ని దర్శించాలనీ
వర్షంలో తడవాలనీ -
ప్రళయకాలంలా
విజృంభిస్తున్న
వాయుగుండంలోంచి,
సుడులు తిరుగుతూ
వడితిరుగుతున్న
తీవ్రవరదల్లో,
భూమ్యాకాశాలు
విచ్ఛేదించే విద్యుల్లతా
తోరణాల్లో పరిభ్రమిస్తూ,
కాళరాత్రిలా
నల్లని మబ్బులు క్రమ్మి
నేల జారిపోతుంటే,
పట్టు చిక్కక కొట్టుకుపోతూ
ఆక్రందిస్తూ ఆక్రోశిస్తూ,
క్షేమంగా ఉంటే చాలనుకునే
తాళలేని ప్రాణాలు కొన్ని..!!

***



Fame is a bee.
It has a song --
It has a sting --
Ah, too, it has a wing

**by Emily Dickinson**

## గొల్లపూడి మారుతిరావుగారి స్వేచ్ఛానువాదాలు

### కీర్తి

తేనెలు చిందే భ్రమరం
ఝుమ్మనే నాదాన్ని పంచుతుంది
పరాకుగా ఉంటే కాటు వేస్తుంది
అన్నీ ఫరవాలేదని అహంకరిస్తే
రెక్కలు విదిలించి ఎగిరిపోతుంది!

### కీర్తి

జీవన చైతన్యానికి స్ఫూర్తి
సునాదాన్ని వినదించే భ్రమరం
అదాటుగా ఉంటే కాటువేసే సమరం
మత్తెక్కించే తేనెలు పంచే నేస్తమే కానీ
నిలుపుకోలేకపోతే రెక్కలు విదిలించే విపర్యయం

### పేరు

మీగడ చిలికిన పేరునెయ్యి
నాలిక తగిలితే స్వర్గం కనిపిస్తుంది
రుచి మరిగితే కృంగదీస్తుంది
నమ్ముకుని కళ్ళు నెత్తికి రానివ్వకండి బాబూ..
నమ్మి వెంటబడితే అది లోతు తెలియని పెద్ద గొయ్యి!

# అజేయం

టి.శ్రీవల్లీరాధిక

**అలుసివ్వకపోతే**
ఏ కోరికా
అగ్నిశిఖ అయి కాల్చలేదు,
ఆజ్యం పోయకపోతే
ఆకర్షణ ఒక్కటే
మంటను రగల్చలేదు !

అచలంగా మనం నిలబడితే
ఆరాట వీచికలు
మనల్ని కూల్చలేవు,
ఆత్మతృప్తిని వీడకపోతే
ఏ ప్రలోభపు పడగలూ
మనల్ని పతనానికి జార్చలేవు!

అందరికన్నా పైనున్న వాడిపై
చూపు నిలిపితే
అల్పాసక్తులు
మన తలని క్రిందికి దించలేవు,
అసలు మారనివాడితో
చేయి కలిపితే
అవకాశవాదాలు
మన వ్యక్తిత్వాన్ని మార్చలేవు !

***

## పగిలిన స్వప్నాలు
## అరుణ దొంతరాజు

**మండుతున్న ఎడారిలో** దప్పికైన బాటసారి
వెదుకుతున్న ఒయాసిస్సు ఎండమావి భ్రమలైతే ,
ఆశలనే దీపాలని కన్నుల వెలిగించుకుంటూ
పెనుగాలులు ఆర్పకుండ కనురెప్పలు కాపాడుతుంటే ,
తడి ఆరని నీ కళ్ళ ఒత్తికి చమురందనీవు..!
ఎన్నాళ్ళీ బ్రతుకుపోరాటం.. నడి సంద్రంలో పడవప్రయాణం
తిమిరాంధకారాన నడిరేయి ఝామున
బ్రతుకు బంగరు నావ వెదుకుతున్నది త్రోవ
దూరాల భ్రమలిడిన దీపస్తంభపు దివ్వె
దాపు జేరిన - గుంపు మిణుగురులై నవ్వె!!!

***



## నిర్వేదం
## జ్యోతిర్మయి

**చెట్టు మీద పిట్ట ఒకటి జాలిగా చూసింది**
ఒంటరి నక్షత్రం బాధగా నిట్టూర్చింది!

ఆనవాలు లేని అలజడేదో...
తొంగి తొంగి చూస్తోంది!
ముక్కలైన రోజులన్నీ...
చీకటి మాటున మెసలుతున్నె !

నిన్న మానిన గాయం
కొత్త మందును కోరుతోంది!
మరచిపోయిన సంగతేదో...
దిగులుకు తోడై వచ్చింది!

అంతులేని విషాదానికి
పాత చిరునామా దొరికింది !
నిలకడలేని ఆలోచన
అంధకారాన్ని ఆశ్రయమడిగింది!

రాలిపోయే ఉల్కను చూసి
ఎగిసే అల విరిగింది!!

***

# మనోవేదన

వేమూరి విజయలక్ష్మి

(శాశ్వతమైన బాంధవ్యబంధంలో పరిస్థితులు తెచ్చిన అపశృతులు
భిన్నమైన దృక్పథాలతో జీవన పయనంలో వచ్చిన అనుకోని మలుపులు.)

**బయటకి ఉరికిన మనోవేదనా జలపాతాలు**
వెనుకకు తిరిగిన గత దినాల ఛాయా చిత్రాలు
ముందుకు తరిమిన నిష్ఠూరాల భావావేశాలు
ఇరువురికి తెలిసిన మలినమైన అంతరంగాలు
అతలాకుతలమై ఉబికిన మాటల తూటాలు
పలువురికి కలిగిన ఇరుకైన ఆలోచనలు
అందరికి నచ్చని కలవని జీవితాలు
ఇంకా ఎందుకు భ్రమ అంతా మామూలుగా ఉందని
ఇంకా ఎంతకాలం వోర్పు సవ్యంగా ఉండాలని
పైకి తేలని స్వార్థపూరిత ప్రణాళికలతో
ఎంతకాలం మోసపోయేది తేనే పూసిన మాటలకు!
ఎవరి జీవితం వారిది, ఎవరి పథకాలు వారివి
ఎవరి దృక్కోణాలు వారివి , ఎవరి సమర్ధింపులు వారివి
అలవిగాని చోట అధికులమనరాదు
స్థానబలము కన్నా తన బలిమి లేదయా
ఎగిరిపో నీ స్వేచ్చా ప్రపంచంలోకి
వదిలిపో ఇరుకైన బంగారు పంజరంలోనుండి
రోజులలోకి వచ్చింది నీ నివాసం ఇక్కడ
రాజు కంటే తృప్తి ఉన్నవాడు బలవంతుడు
రాజరికం ఇవ్వదు మనశ్శాంతి
ఆకలి రుచి ఎరుగదు
నిద్ర సుఖమెరుగదు
పరుషమైన మాటలతో పంచభక్ష్య పరమాన్నం కంటే
పరువైన బ్రతుకులో పచ్చడి మెతుకులు రుచి

****

# అమ్మాయిలూ జాగ్రత్త కోసూరి ఉమాభారతి

**ఉన్మాదితో సయ్యాటలు, నిప్పుతో చెలగాటాలు**
ముసుగేసిన కరుకుతనం, గుర్తించని పసితనం
కొరివితో గాఢస్నేహం వదులుకో!
తెలివితో సన్మార్గాన నడుచుకో!
ముగ్ధమనోహర రూపమంటాడు
పంచదార చిలక పలుకులంటాడు
ఇంతీ, చేమంతీ. పూబంతీ అంటూ
వెనువెంటే ఉంటూ, తికమక పెడతాడు
నీ చూపులు, నీబాసలు చాలునంటాడు
నీ ఎడబాటుని సహించలేనంటాడు
తన తడబాటుని గ్రహించమంటాడు
పిచ్చివాడ్నై, నీకై రచ్చకెక్కానంటాడు !
తెరతెరుగని అడవితనం వాడిది
సుతిమెత్తని సుకుమారం నీది
ఎదుటపడకు, ఆశలు రేపకు
నిరాశ ఎదురైతే ఆవేశ పడతాడు!
కళ్ళల్లో విషం, గుండెల్లో కల్మషం
మరమనిషి వాడు, మనసులేని మగవాడు
కోతవుతాడు, తోకతొక్కిన తాచవుతాడు
అటుపై పగలతో సెగలు కక్కుతాడు
జగమెరిగిన జూదగాడు, అలుపెరుగని వేటగాడు
నీతెరుగని కేటుగాడు, పోటెత్తిన పొగరుబోతు
గుంభనంగా ఉంటే పోలా? విషచుంబనం నీకేల?
చాటుమాటు ప్రేమలకన్న, పెద్దల మాటే మిన్న
వాడికై ఆగకుమా! తూగకుమా! ఏమారకుమా!
లోగిలి వీడకు, తోడేలు పాలవకు
గండు తుమ్మెదల బారినుండి
తేరుకో, పారిపో, రహదారిన సాగిపో!! ***

# అతనొక సైనికుడు

మనస్విని

**తండ్రి పదవీవిరమణ చేస్తున్న రోజైనా**
తల్లి ఆసుపత్రి పాలైన రోజైనా
చెల్లెలి పెళ్ళి చూపులకై వరుడు వస్తున్న రోజైనా
తమ్ముడు డిగ్రీ పట్టా పొందిన రోజైనా
తోడు ఉండలేని ఓ అభాగ్యుడు, అతనొక సైనికుడు

అభేద్యమైన శత్రు స్థావరాలను ఎదుర్కోవాలన్నా
రోజుల తరబడి అన్నపానాలు లేకున్నా
సాటి సైనికులు నేలరాలుతున్నా
గురితప్పని శత్రువు తూటా గుండెలో దిగితున్నా
వెరువని ఓ ధైర్యవంతుడు, అతనొక సైనికుడు

శత్రువు పేల్చిన మందుపాత్రలో విచ్చిన్నమైన
తన తోటి సైనికుడి అవయవాలు సేకరించాలన్నా
ఎడతెగని శస్త్ర వర్షం కురుస్తున్నా
క్షతగాత్రులకు ధైర్యం చెప్పి సేవ చెయ్యాలన్నా
ప్రాణాలొడ్డి ముందుకుసాగే ఓ సాహసవంతుడు, అతనొక సైనికుడు

అవినీతి పరులు పందికొక్కుల్లా దేశాన్ని దోచుకొంటున్నా
కులమతాల పేరుతొ తోటి పౌరులు మారణహోమం చేస్తున్నా
ప్రకృతి విలయతాండవం ఆడి ప్రజా జీవనాన్ని ఛిద్రం చేసినా
గ్రీష్మ, శిశిర తాపాలు తాళలేకున్నా
అన్నిటినీ భరించి, దేన్నైనా సహించి
దేశాన్ని కాపాడే ఓ త్యాగశీలి, అతనొక సైనికుడు !!

****

# గొంగళి - నల్లనయ్య  బత్తిని తిమ్మగురుడు

**పచ్చనాకు సాక్షిగా**

నా రూపమంటే ఎందరికో పరమ అసహ్యం
పసుపుపచ్చరంగులో నేను
ముళ్ళలాంటి కణుపులేవో..నావొంటిపైన!
నన్ను చూసి అసహ్యించుకునే వారు
సీతాకోక చిలుకను చూసి సంబరపడతారెందుకో!
నాలోని అసలు సౌందర్యమదని ఎరుగరెందుకో!
అందరి చూపులకు
ఉమ్మెత్త పువ్వంటే అందమైన తెల్లని పుష్పం
మరి ఆత్మ సౌందర్యోపాసకుడికి
ఉమ్మెత్త పువ్వంటే దుర్గంధభరిత పుష్పం
మహా మాయావి ఈ పుష్పం
చర్మ సౌందర్యం చూసి
ఆత్మ సౌందర్యం మరచి
అభిమానించి,ప్రేమిస్తే
అది శారీరక వాంఛ కాక
ప్రేమవుతుందా?
నా ఆత్మసాక్షిగా
నేనంటే ఎందరికో అసహ్యం
ఈ భూప్రపంచం మీద
నల్లనిరూపుతో నేను
అందానికి వ్యతిరేకమైనవెన్నో..నా వొంటిపైన
అలాగని నేను బాధపడలేదు
అవమానించవద్దని కోరుతున్నా
నిజమే..నేను నల్లనయ్యనే
మనిషి రూపంలో ఉన్న గొంగళి పురుగునే!!

***